V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
15-08-2024

సంపుటి : 01 | సంచిక : 103 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

విశ్వంభర పాఠకులకు,
వి3 న్యూస్ వీక్షకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
78వ స్వాతంత్ర్య
దినోత్సవ
శుభాకాంక్షలు
డా॥ కాచం సత్యనారాయణ
CMD





# లాలిత్యం ఆసుపత్రిని ప్రారంభించిన మధుయాష్కీగౌడ్

**విశ్వంభర, వనస్థలిపురం :**

వనస్థలిపురం, సుష్మ చౌరస్తా ఇందిరానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లాలిత్యం ఆసుపత్రిని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే వారి ఆదరణ పొందగలరని, ఆ దిశగా ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు, చిన్నపిల్లల వైద్యానికి ప్రత్యేకతగా ఏర్పాటుచేసిన లలిత్యం ఆస్పత్రి అన్ని విధాలుగా సక్సెస్ కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ వంశీ మోహన్, కొండోజు శ్రీనివాస్, మొరిశెట్టి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుమారుడు చేసిన అప్పులు తీర్చలేక తల్లిదండ్రుల ఆత్మహత్య

**విశ్వంభర, నంద్యాల:** పిల్లలను ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు తల్లిదండ్రులు అహర్నిశలు శ్రమిస్తారు. అయితే కొందరు పిల్లలు అడ్డదారులు తొక్కుతూ తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేస్తున్నారు. వారి జీవితాలను నాశనం చేసుకోవటమే కాక అందినకాడికి అప్పులు చేస్తూ తల్లిదండ్రుల చావుకు కారణమవుతున్నారు. ఇలాంటి ఘటనే నంద్యాల జిల్లాలో వెలుగులోకి వచ్చింది. కుమారుడి కోసం చేసిన అప్పులు తీర్చలేక విషం తాగి రైతు దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం:** ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలోని వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి(48), ప్రశాంతి(42) దంపతులకు ఒక కుమారుడు నిఖిలేశ్వర్ రెడ్డి ఉన్నాడు. హైదరాబాద్‌లో ఉంటూ బిజినెస్ చేస్తున్నానని తల్లిదండ్రులను నమ్మించి విపరీతంగా అప్పులు చేయించాడు. కుమారుడి కోసం ఆ దంపతులు దాదాపు 2 కోట్ల 40 లక్షల రూపాయల వరకూ అప్పులు చేశారు. అయితే కుమారుడు ఆ నగదును ఇష్టమొచ్చినట్లు దుబారా చేస్తున్నాడనే విషయం ఆ తల్లిదండ్రులు గ్రహించలేకపోయారు. తీరా అప్పు ఇచ్చినవాళ్లు డబ్బు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేశారు. అప్పులు తీర్చే దారి లేక ఇల్లు, పొలాన్ని అమ్మేశారు. అయినా ఇంకా సగం అప్పులు మిగిలే ఉన్నాయి. మిగిలిన డబ్బు కూడా చెల్లించాలని అప్పు ఇచ్చినవాళ్లు వేధించడంతో ఇంకో పొలాన్ని అమ్మకానికి పెట్టారు. అయితే అది తక్కువ ధరకు అడగటంతో అప్పులు తీర్చేందుకు ఏం చేయాలో తెలియక తీవ్రంగా సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో ఆ దంపతులు గత ఆరు నెలలుగా గ్రామాన్ని విడిచి వెలుగోడులోని అత్తామామల వద్ద ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడి దంపతులు మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఈడీ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్ నియామకం..

**ఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫుల్‌టైమ్ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్ నియామకమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఆయనను ఈడీ డైరెక్టర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు చెందిన 1993వ బ్యాచ్ అధికారి. ఈడీ డైరెక్టర్‌గా పని చేసిన సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలం గతేడాది సెప్టెంబర్ 23తో పదవీకాలం ముగిసింది. ఆయన స్థానంలో యాక్టింగ్ డైరెక్టర్‌గా నవీన్ బాధ్యతలు చేపట్టారు. గతంలో సంజయ్ మిశ్రా ఆధ్వర్యంలో రాహుల్ నవీన్ సైతం సేవలందించారు. ఇక రాహుల్ నవీన్ రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతున్నారు. లేదంటే తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పదవిలో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. 57 ఏళ్ల నవీన్ 2019 నవంబర్‌లో ఈడీలో స్పెషల్ డైరెక్టర్‌గా చేరారు.






# ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో లక్ష్మీనారాయణ వృక్ష కళ్యాణం

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** శాలివాహన నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో రావి, వేప వృక్ష కల్యాణం, శ్రావణమాసం సందర్భంగా పుష్కర లక్ష్మీనారాయణ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ, యజ్ఞాచార్యులు కాటూరి శ్రీను స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు అనేక అద్భుతాలు జరిగాయని చెప్పారు. ఆలయ అధ్యక్షుడు దొంతుల మాణిక్య రెడ్డి మాట్లాడుతూ.. స్వామి కళ్యాణ జీలకర్ర, బెల్లం తీసుకున్న వారికి కోరిన కోరికలు నెరవేరాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాణిక్య రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులతోపాటు కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల పోరాటాలు, మరెందరో బలిదానాల ఫలితంగా సాధించుకున్న దేశ స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకూ చేరిన నాడే సంపూర్ణ సార్థకత చేకూరుతుందని అన్నారు. మహాత్మా గాంధీ నడిపించిన భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో శాంతియుత మార్గంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, ప్రజల సహకారంతో పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్నిరంగాల్లో సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా దేశ పాలకుల కార్యాచరణ మరింత చిత్తశుద్ధితో అమలుచేసి ఫలితాలు సాధించడం ద్వారా మాత్రమే స్వాతంత్ర్య పోరాట త్యాగధనులకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

# ప్రజా పాలన అంటే.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా..?

- కాంగ్రెస్ సర్కార్‌ను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసింది.. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది.. ప్రజా పాలన అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారింది. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయి. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన అంటే.. ?? అని కేటీఆర్ నిలదీశారు.

**1800 మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు**

నాడు.. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశాం. నేడు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామపంచాయతీలకు ఇంకెప్పుడు ఇస్తారు..? ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారు..? 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లని అంచనా. వాటి పరిస్థితి ఏంటి..? అని కేటీఆర్ ప్రశ్నించారు.



**పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యం?**

దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యం.. కాంగ్రెస్ పాలనలో.. పల్లెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. ఇక పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రేటర్ తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. రాష్ట్ర బడ్జెట్ లో జీహెచ్ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా..? కాంగ్రెస్ చెప్పుకునే ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా..? అని కేటీఆర్ అడిగారు.

**మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు..**

మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు.. కొత్త పనులకు ప్రణాళిక లేదు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మత్తులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా..? వర్షాకాలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రతినిత్యం అవస్థలు పడుతున్న ప్రజలకు ఏం సమాధానం చెబుతారు..? మున్సిపాలిటీల్లో రూ.1200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే.. ఇక ఇతర శాఖల దుస్థితి ఏమిటి..? అని కేటీఆర్ మండిపడ్డారు.

**ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు**

ఆగస్టు 15 లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ఈ ప్రభుత్వానికి ఉందా..? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గట్టెక్కించే ధైర్యం ఉందా..? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉందా..? బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు పచ్చగా కళకళలాడిన పల్లెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షోభంలో కొట్టుమిట్టాడటం మీ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం.. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరిచిపోకండి అని కేటీఆర్ పేర్కొన్నారు.



V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
15-08-2024
సంపుటి : 01 | సంచిక : 103 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


విశ్వంభర పాఠకులకు,
వి3 న్యూస్ వీక్షకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
78వ స్వాతంత్ర్య
దినోత్సవ
శుభాకాంక్షలు
డా॥ కాచం సత్యనారాయణ
CMD



## మా పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదు

# ప్రపంచంతోనే..

## ట్రిలియన్ డాలర్ల తెలంగాణే మా సంకల్పం

ప్రపంచ అవసరాలు తీర్చే ఫ్యూచర్ సిటీగా ఫోర్త్ సిటీ

కాగ్నిజెంట్ నూతన ప్రాంగణ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

ఫ్యూచర్ సిటీలో కాగ్నిజెంట్‌కు ఆహ్వానం

**విశ్వంభర, హైదరాబాద్:**

తమ పోటీ పొరుగు రాష్ట్రాలతో కాదని ప్రపంచంతోనే తమ పోటీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలపాలనేది తమ సంకల్పమని ముఖ్యమంత్రి తెలిపారు. కోకాపేటలో కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 430 సంవత్సరాల చరిత్ర హైదరాబాద్ కు ఉందని, నగర స్థాపకుడు కులీకుతుబ్ షా నుంచి తన వరకు ఎవరు పాలించినా, ఎన్ని వ్యవస్థలు మారినా విధానాలతో సంబంధం లేకుండా ప్రతి మిగతా5లో...

36 వేల కోట్ల పెట్టుబడులతో

### రికార్డు

అమెరికాలో రూ.31502 కోట్లు

దక్షిణ కొరియాలో రూ.4500 కోట్లు

తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు

విజయవంతమైన సీఎం రేవంత్ విదేశీ పర్యటన

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు 5

# ప్రజాస్వామ్యంలో స్థిరమైన పురోగతి

సామాజిక న్యాయమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం

పేదరికం నుంచి బయటకు కోట్ల మంది

స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**దిల్లీ:** భారతదేశంలో రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరమైన పురోగతి సాధించిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు.ఇది సామాజిక ప్రజాస్వామ్యం పురోగతిని ప్రతిబింబిస్తుందని నొక్కి చెప్పారు. దేశం దాని భిన్నత్వంలో ఏకత్వంపై అభివృద్ధి చెందుతుందని, ఒక సంఘటిత శక్తిగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అనేక చర్యలు ప్రారంభించిన మోదీ ప్రభుత్వం, సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. 'అందరినీ భాగస్వామ్యులను చేయాలనే స్ఫూర్తి మన సామాజిక జీవితంలోని ప్రతి అంశంలోనూ ఉంది. మన వైవిధ్యం, బహుళత్వంతో మనం ఒక సమ్మిళిత దేశంగా కలిసి కదులుతాం. మిగతా5లో...




## ఎర్రకోటపై వరుసగా 11వ సారి..

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ

**దిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన ఘనత సాధించబోతున్నారు. ఇప్పటికే వరుసగా మూడు సార్లు కేంద్రంలో అధికారం చేపట్టి.. తొలి ప్రధాని మిగతా11లో...

## జెండా పండుగకు ముస్తాబైన గోల్కొండ

పతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** స్వాతంత్ర్య వేడుకలకు గోల్కొండ కోట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విద్యుత్ దీపాల కాంతులతో ధగధగ-లాడుతోంది. తెలంగాణ ఆవిర్భావం నుంచి గోల్కొండపై జెండా పండుగ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇక్కడే పండుగను ఘనంగా మిగతా11లో...



SRESHTA
ORANGE HOSPITAL
HOPE LIVES HERE
A Super Speciality Hospital Located @ L.B.Nagar
HAPPY
Independence Day
Scan Here for Location
Experienced Doctors
Advanced Technology
Modern Lab Test
www.orangehospitals.co.in
/orangehospitals
AVAILABLE SERVICES:
CARDIOLOGY | ORTHOPEDIC
NEUROLOGY | OPTHALMOLOGY
& ALL EMERGENCY SERVICES
Emergency: 9966 108 108

యూఎన్‌లో శాశ్వత ప్రతినిధిగా

## హరీశ్ పర్వతనేని నియామకం



**దిల్లీ:** న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధిగా హరీశ్ పర్వతనేని నియమితులయ్యారు. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న రుచిరా కాంబోజ్ మిగతా5లో...



## యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

అత్యున్నత పతకం గెలుచుకున్న తెలంగాణ హెడ్ కానిస్టేబుల్

1037 మంది తెలుగువారికి అవార్డులు 5



## ఏఎస్పీ పి.కృష్ణమూర్తికి రాష్ట్రపతి మెడల్

11

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 84 | ₹ 106 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 153 | ₹ 176 |



## రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు నిరాశే

అప్పీల్‌ను తిరస్కరించిన స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్..! 11

## తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ



5

# జాతీయ పతాక... దేశ గౌరవానికి ప్రతీక

**త్రివర్ణపతాకాన్ని భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ మణిపూరులో ఆవిష్కరించారు. 1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో - చరఖా స్థానంలో "ఆజాద్ హింద్" అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో వాడుకొంది.**

20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారతదేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. "(భారత) మాతకు వందనం" అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)" ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు.1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జెండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం.1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్సీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించారు. ఈ పతాకాన్ని "కలకత్తా పతాకం" అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ పాటు సమాంతర

## రూపకల్పన నేపథ్యమిది!

గీతలను కలిగి ఉంది. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, సూర్యుడు మధ్యలో దేవనాగరి లిపిలో "వందేమాతరం" అనే అక్షరాలు ఉన్నాయి.

1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార-నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు-ఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నం గుర్తును రూపొందించి చూపారు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించారు. . ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగులు, ముస్లిం ఫకీర్లు-దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్కులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక యువకుడు జెండా తయారు చేసి గాంధీజీకి ఇచ్చాడు. ఈ కార్యక్రమం 1921లో బెజవాడ (ప్రస్తుతం విజయవాడ)లో జరిగింది. ఇది రెండు రంగులతో తయారు చేయబడింది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు.

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. "జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని" కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు.



తర్వాత 1931 కరాచీ కాంగ్రెస్ సమావేశంలో పై నుంచి కిందకు వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని స్వీకరిస్తూ జాతీయజెండాపై తుది తీర్మానం ఆమోదించబడింది.

స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్. అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయపతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగస్టు 15 నాడు ఆవిష్కరించారు.

## జెండా!!

ఒట్టి పతాకమే అనుకునేవు సుమా!
పరికించి చూస్తే అది
దేశం గుండెలో రెపరెపలాడే
జాతిశ్వాస!

భరత జాతి శిరస్సు మీద
అమరవీరుల నినాదాలు
మారుమోగే హిమాచలం కొండ!

బ్రతుకు గీతను మార్చే
గీతాసారం
సమైక్యత చాటి చెప్పే
రఘుపతి రాఘవ రాజారాం!

జాతి దురాహంకారం మీద
ఎక్కుపెట్టిన గాండీవం
సమ సమాజ నిర్మాణానికి
ఎత్తిన జయ కేతనం!

అణగదొక్కిన చీకటి
ఉక్కు తెరలను తొలగించి
తూర్పు దిక్కున
ఉదయించిన ప్రగతి కిరణం!

జాతి జనుల విమలాశయ
సువిశాల కల్పవృక్షం!
ఆకాశపుటంచుల దాకా
వినిపించే జైహింద్ ఘోష
అఖండ భారతావని వసుధైక కుటుంబ
హృదయ దిగ్ఘోష !

సకల దేశాల భావాల కలబోత
రాజ్యాంగం ప్రమిదలో
సౌభ్రాతృత్వమై వెలిగే
అఖండ దీపం నా జెండా!

ఒక్కసారి జండాను
యెత్తి పట్టుకుని విను!
నర నరాన దేశభక్తియై ఉప్పొంగే
వందేమాతర గంగా తరంగఝురి!
వినిపిస్తుంది వేద నాదంలా!

జాతి పౌరుషం కాషాయం
రైతు పరవశం హరిత ప్రభాసం
శాంతి పాఠం శ్వేత సోయగం
ప్రగతి పథమా ధర్మ చక్ర పరివర్తనం

నూట నలుబది కోట్ల భారతీయుల
గుండెలు ఒక్కటై నినదించే
ఆత్మనిర్భర జాతి గీతం
అఖండ ఐక్య భారతం!




-కె.ఎస్.అనంతాచార్య
కరీంనగర్
ఫోన్: 9441195765

# జనగణమన... మదనపల్లెలో స్వరకల్పన

## ఠాగూర్ సమక్షంలో బాణీ కట్టిన ఐరిష్ జాతీయురాలు

భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలని... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియదు. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. జనగణమన గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు.1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ బోధిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునే వారు.

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు.



బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు.ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. దేశభక్తి గేయమైన జనగణమన బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది

1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది... 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి'' అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. ''ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి'' అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది.

# మెట్‌పల్లి ఖాదీ..దేశానికి ప్రతిష్ఠ

**ఖాదీ గ్రామోద్యోగ సంస్థాన్ 98 ఏళ్ల ప్రస్థానం**
**నిజాం నిరంకుశ పాలన వ్యతిరేకోద్యమానికి ఊతం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెట్ పల్లి ఖాదీ ప్రతిష్ఠాన్ 1928 లో చిన్న కుటీర పరిశ్రమ గా మొదలై నేడు దేశ విదేశాలలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. భారతదేశాన్ని పరాయి పాలకులు పీడన నుంచి విముక్తి చేయడానికి, స్వయం సమృద్ధి సాధించడానికి గ్రామ స్వరాజ్య స్థాపనకు చరఖా పరిశ్రమల పునరుద్ధరణే ఏకైక మార్గమని మహాత్మా గాంధీ గుర్తించారు. దేశం మొత్తం మీద 20 లక్షల రాట్నాలను నడిపించాలని 1926 లో నాగపూర్ లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో తీర్మానించారు చరఖాప్రచారాన్ని కాంగ్రెస్ ద్వారా మొదలు పెట్టి దానికి అఖిల భారత చరఖా సంఘమని పేరు పెట్టారు. అయితే ఈ చరఖా సంఘానికి కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తే ఖాదీ పరిశ్రమకు రాజకీయ రంగు అంటుతుందని భావించి, విడిగా ఖాదీ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ రాజకీయాలకు దూరంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉండాలని తలిచారు.

**సహస్రబుద్దే చొరవ**

ఈ క్రమంలో హైదరాబాద్ సంస్థానంలో ఖద్దరు పరిశ్రమను ప్రారంభించి అభివృద్ధి పరచడానికి ఆదర్శ కార్యకర్త అయిన అన్నాసాహెబ్ సహస్ర బుద్దేను మహారాష్ట్ర చరఖా సంఘం వారు నిజాం సంస్థానానికి పంపించారు. సహస్ర బుద్దే తన కార్య సాధనలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. రవాణా సౌకర్యం లేకపోయినా.. రాకపోకలకు ఎంతో కష్టంగా ఉండే గ్రామాలకు కాలినడకన వెళ్లి ఖాదీ పరిశ్రమ నిర్మాణం కోసం ప్రయత్నించారు. తెలుగు భాష రాని కారణంగా చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ ఆయన నిరంతర కార్యదీక్ష ఫలించింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తాలూకా మోర్తాడ్ లో పర్యటిస్తున్న సహస్ర బుద్దేకు మరాఠీ తెలిసిన ఉపాధ్యాయుడు పరిచయమయ్యాడు. ఆయనకు తాను చేస్తున్న కార్యక్రమాల గూర్చి వెల్లడించారు . ఆ అధ్యాపకుడు విద్య నేర్చుకుంటున్న భోగ పాపయ్య పంతులు ను వెంటపెట్టుకొని కరీంనగర్ జిల్లా మెట్ పల్లి ప్రాంతంలో పర్యటించారు. మెట్ పల్లి లో వారానికొక రోజు జరిగే సంత పరిశీలించగా అక్కడ లావాటి దారం కండెలు అమ్ముకునే వారు కనిపించారు. ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడిన ప్రాంతం. ఇక్కడ అభివృద్ధి అసలే లేదని గమనించారు. అందుకే ఎక్కువగా చరఖా వడికే వారున్న మెట్ పల్లి ప్రాంతంలో ఖాదీ పరిశ్రమ ఏర్పాటు చేయదలచారు. అన్నా సాహెబ్ సహస్ర బుద్దే 1929లో మెట్ పల్లిలో ఖాదీ పరిశ్రమను స్థాపించారు. కేవలం 500 రూపాయల ఉత్పత్తితో ప్రారంభమై , పురాతన పద్ధతుల నుండి ఆధునిక పద్ధతులకు ఈ పరిశ్రమ అంచలంచెలుగా ఎదిగింది. సహస్ర బుద్దే, ద్వారకానాథ్ లేలే, శంకర్రావు లేలే, సహాయ సహకారాలతో కార్యకర్తలను ఉత్తేజపరిచి మెట్ పల్లి ఖాదీ కేంద్రం నుండి ఖద్దరు పరిశ్రమను దినదిన ప్రవర్ధమానం చెందేలా అభివృద్ధి పరిచారు. ఈ కేంద్రం కాలక్రమేణా ఒక పెద్ద ఖాదీ కేంద్రంగా అభివృద్ధి చెంది ఖాదీకి గర్వకారణమైంది. వైద్యనాథ, గాంధీ సిద్ధాంతానికి ప్రభావితుడై ఖాదీ ఉద్యమాలకు ప్రచారం చేస్తూ ఎంతో మంది యువకులకు ఉత్తేజపరిచారు. మెట్ పల్లి ఖాదీ కార్యాలయం చుట్టు పక్కల ప్రాంతాల వారికి వైద్య, విద్య సేవలు కూడా అందించేవారు.


1931లో నెలకొల్పిన ఖాదీ వైద్యశాల ద్వారా ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిలాల్ మనులాల్ ఖాద్రి, కార్మికులకు వైద్య సేవలు అందించేవారు. వీరికి డాక్టర్ రామచంద్రం, డాక్టర్ లక్ష్మీనారాయణ రాజు, కాసం శివరాజం గుప్తలు సహాయకులుగా పనిచేసేవారు. వీరు నెలకొల్పిన ఖాదీ కార్మికుల పాఠశాలకు భోగ పాపయ్య పంతులు, బట్టు లక్ష్మీబాయి అధ్యాపకులుగా పని చేస్తూ ఉండేవారు.

**నిజాం పాలనకు వ్యతిరేక పోరాటానికి ఊతం**

ఖాదీ పరిశ్రమ దిన దినాభివృద్ధి చెంది భారతదేశంలో విదేశీ పాలనకు మరియు నిజాం సంస్థానం లోని నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన విముక్తి పోరాటాలలో ప్రజలు ఐక్యంగా పాల్గొనడానికి దోహద పడింది. 1946 లో నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటం ఉద్ధృతం అయింది. దీనితో కొందరు ఖాదీ కార్యకర్తలపై నిర్బంధాలు విధించారు. దేశం నలుమూలలా స్వతంత్రం కోసం పోరాడుతున్న ఉద్యమకారులు తమపై ఉన్న నిర్బంధాల వలన వివిధ ప్రాంతాల నుండి కరీంనగర్ జిల్లా మెట్ పల్లి , ఖాదీ సంస్థాన్ కార్యాలయానికి వచ్చి తలదాచుకునేవారు. అప్పటివరకు ఖాదీ కార్యాలయాలపై, చరఖా సంఘాలపై నిషేధం లేకుండేది. కానీ నిర్బంధం ఉన్న కార్యకర్తలు విపరీతంగా వస్తున్నందువల్ల నిజాం సంస్థానంలోని మెట్ పల్లి ఖాదీ కార్యాలయం కార్యకర్తలను కూడా నిర్బంధించడంతో 1946 నుండి 19 49 వరకు మెట్ పల్లి కార్యాలయం కార్యక్రమాలు కుంటుబడ్డాయి. తిరిగి 1950లో స్వామి రామానంద తీర్థ అధ్యక్షతన ఖాదీ సంస్థాన్ తిరిగి ప్రారంభమైంది.

**ఎన్నో ప్రత్యేకతలు**

కోదూరు జగిత్యాల లో తయారయ్యే వివిధ డిజైన్ల చేనేత చీరలు , కోరుట్ల కేంద్రపు సన్నని ఖాది వేములవాడ కేంద్రపు తగిడి ఖాదీ, గంభీరావురం కేంద్రపు కోటింగు మెట్ పల్లి కేంద్రపు దోమతెర, సన్నని ధోవతులు దేశంలోనే ప్రఖ్యాతి గాంచాయి .మెట్టుపల్లి నివాసి అయిన జోగు గంగారం అనే పద్మశాలి అఖిలభారత ఖ్యాతి నొందారు. ఎక్కడా కుట్టు అనేది లేకుండా పూర్తి మగ్గం పైనే నెహ్రూ షర్ట్, పైజామా, బ్లౌజులు.దిండు గలీబులు, శర్వాణి, త్రివర్ణ పతాకాలు అత్యంత అద్భుతంగా నేయటంతో ఇతనికి ఉన్న కళా నైపుణ్యాన్ని స్వయంగా అప్పటి ప్రధాని జవ హర్ లాల్ నెహ్రూ, రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ లు స్వయంగా అభినందించారు అంతటి ఘన చరిత్ర కలిగిన మెట్ పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ సంస్థాన్ మొట్ట మొదటి అధ్యక్షులుగా రామానంద తీర్థ.నుండి మొదలు నేడు ఉన్న అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు వరకు రాబోయే తరాలకు కూడా ఖాదీ ఉత్పత్తులను పరిచయం చేస్తూ అభివృద్ధి పథంలో సాగుతోంది. ప్రతి ఒక్కరూ ఖాదీ వినియోగించి ఖాదీ అభివృద్ధికి పాటుపడాలి.



-నన్నపు రాజ్ రవిరాజ్
మెట్ పల్లి

# ప్రజాస్వామ్యంలో స్థిరమైన పురోగతి



(మొదటి పేజీ తరువాయి)
దీని దిశగా తప్పనిసరిగా బలోపేతం కావాలి' అని ముర్ము పిలుపునిచ్చారు. విశాలమైన దేశంలో, సామాజిక అంతరాలు ఆధారంగా అసమ్మతిని రేకెత్తించే ధోరణులను తిరస్కరించవలసి ఉంటుందని గట్టిగా నమ్ముతున్నట్లు రాష్ట్రపతి తెలిపారు.

**అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి**
పేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే ప్రధాన్ మంత్రి సామాజిక్ ఉత్థాన్ ఏవం రోజ్ గార్ ఆధారిత్ జనకళ్యాణ్, ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ సహా అట్టడుగు వర్గాల కోసం తీసుకొచ్చిన అనేక ప్రభుత్వ కార్యక్రమాలను ముర్ము వివరించారు. ముఖ్యంగా గిరిజనుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం కోసం తీసుకొచ్చిన స్కీమ్‌లను ప్రస్తావించారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదకర పనుల్లో పాల్గొనకుండా చూసుకోవడం, వ్యర్థాలను మానవులు తొలగించకుండా రక్షించేందుకు తీసుకొచ్చిన నమస్తే పథకం గురించి చర్చించారు.

**మహిళా సాధికారతకు ప్రాధాన్యం**
భారతీయ సమాజంలో మహిళలను సమానంగా చూస్తున్నప్పటికీ, సంప్రదాయ పక్షపాతాలు కొనసాగుతున్నాయని ద్రౌపదీ తెలిపారు. గత దశాబ్దం నుంచి మహిళా సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులను మూడు రెట్లు పెంచినట్లు తెలిపారు. స్త్రీ కార్మికుల భాగస్వామ్యాన్ని పెంచడానికి, మెరుగైన లింగ నిష్పత్తికి దారితీసిందని పేర్కొన్నారు. మహిళా సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందన్నారు. మహిళా సాధికారతకు నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ చట్టం) ఒక ముఖ్యమైన అడుగు అని చెప్పారు.

**అతిపెద్ద ప్రజాస్వామ్య క్రతువు**
2024 లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో దాదాపు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, చరిత్రలో అతిపెద్ద ఎన్నికల క్రతువును సజావుగా నిర్వహించారని తెలిపారు. ఎన్నికల సంఘం, భద్రతా సిబ్బందిని ఆమె ప్రశంసించారు. 'ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడు, అది ప్రజాస్వామ్య విధానాన్ని ప్రతిధ్వనిస్తుంది. భారతదేశం విజయవంతంగా ఎన్నికలను నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులను బలపరుస్తుంది' అని అన్నారు.

## యూఎన్‌లో శాశ్వత ప్రతినిధిగా హరీశ్ పర్వతనేని నియామకం

(మొదటి పేజీ తరువాయి)
జూన్‌లో రిటైరయ్యారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ పదవిలో హరీశ్ పర్వతనేని నియామకం అనివార్యమైందని స్పష్టం చేసింది. మరికొద్ది రోజుల్లో ఆయన తన పదవి బాధ్యతలు చేపడతారని వివరించింది ప్రస్తుతం హరీశ్ పర్వతనేని జర్మనీలో భారత రాయబారిగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపింది. 1990, ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారి హరీశ్ పర్వతనేని. 2021, నవంబర్ 6న జర్మనీలో భారత రాయబారిగా ఆయన నియమితులయ్యారు. అంతకుముందు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ఆర్థిక సంబంధాల విభాగంలో అదనపు కార్యదర్శిగా విధులు నిర్వహించారు. గత మూడు దశాబ్దాల పాటు పలు ద్వైపాక్షిక ఆర్థిక వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. అలాగే జీ 20, జీ 7, బ్రిక్స్, ఐబీఎస్ఏలో సైతం ఆయన ముఖ్య భూమిక పోషించారు. తూర్పు ఆసియాతోపాటు విదేశీ ప్రచార విభాగాల్లో కూడా పని చేశారు.

**ఉస్మానియా నుంచి ఇంజినీరింగ్ పట్టా...**
బారత ఉప రాష్ట్రపతికి ఓఎస్డీగా, సంయుక్త కార్యదర్శిగా కూడా వ్యవహరించారు. వివిధ దేశాల్లోని భారత రాయబార కార్యాలయంలో సైతం ఆయన వివిధ హోదాల్లో పని చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంగా హరీశ్ పర్వతనేని గోల్డ్ మెడల్ అందుకున్నారు. అనంతరం కోల్‌కతాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. నందితను హరీశ్ వివాహం చేసుకున్నారు.

## యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

(మొదటి పేజీ తరువాయి)
విశ్వంభర, హైదరాబాద్: పంద్రాగస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ, పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1037 మందికి ఈ పతకాలను ప్రదానం చేయనున్నారు. ఇక, ఈసారి అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పోలీసు పతకం ఒకరిని మాత్రమే వరించింది. అది కూడా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు రాష్ట్రపతి గ్యాలంటరీ మెడల్‌ను ప్రకటించారు. రాష్ట్రపతి గ్యాలంటరీ మెడల్ యాదయ్యకు రావడంపై రాష్ట్ర డీజీపీ జితేందర్ హర్షం వ్యక్తం చేశారు. యాదయ్యను తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

**ఎవరీ యాదయ్య ?**
తెలంగాణ పోలీసు శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య 2022లో ఓ దొంగతనం కేసులో ధైర్యంగా వ్యవహరించారు. గొలుసు చోరీలు, ఆయుధాల డీలింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దుండగులు ఇషాన్ నిరంజన్ నీలంనల్లి, రాహుల్‌ను సాహసోపేతంగా పట్టుకున్నారు. 2022 జులై 25న దొంగతనానికి పాల్పడుతుండగా యాదయ్య వీరిని అడ్డుకున్నారు. దీంతో దుండగులు ఆయనపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశారు. ఛాతీ పైభాగాన పలుమార్లు పొడిచారు. తీవ్ర రక్తస్రావం అయినప్పటికీ ఆయన వారిని పట్టుకున్నారు. తీవ్ర గాయాల కారణంగా 17 రోజుల పాటు ఆయన ఆసుపత్రి పాలయ్యారు. దుండగులను బంధించే క్రమంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గాను ఈ ఏడాది అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకాన్ని ప్రకటించారు.

**తెలుగు రాష్ట్రాలకు పతకాలు**
ఈ ఏడాది మొత్తం 1037 మందికి ఈ పతకాలు ప్రదానం చేయనున్నారు. ఇందులో 208 మందికి పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంటరీ, 75 మందికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకాలు, 624 మందికి పోలీసు విశిష్ఠ సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను అందజేయనున్నారు. ఈ పురస్కారాల్లో తెలంగాణ నుంచి 21 మందికి, ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మందికి ఈ పతకాలు వరించనున్నాయి. ఇందులో రాష్ట్రంలో ఒకరికి రాష్ట్రపతి గ్యాలంటరీ పతకం, ఏడుగురికి మెడల్ ఫర్ గ్యాలంటరీ, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకం, 11 మందికి పోలీసు విశిష్ఠ సేవా పతకాలు ఇవ్వనున్నారు. ఇక, ఆంధ్రా నుంచి నలుగురికి మెడల్ ఫర్ గ్యాలంటరీ, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకం, 19 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ పతకాలు అందజేయనున్నారు.

# మా పోటీ ప్రపంచంతోనే..

(మొదటి పేజీ తరువాయి)
ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే ఇక్కడి నుంచి పెట్టుబడులు అక్కడి తరలిపోతాయనే చర్చను కొందరు ప్రారంభించారని.. కానీ తన పోటీ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుతో కాదని ప్రపంచంతోనేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం, దేశంలోనే అత్యధికంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించే కాగ్నిజెంట్ తమ దగ్గర ఉందన్నారు. కుతుబ్ షాహీలు, నిజాంలు హైదరాబాద్‌ను నిర్మిస్తే... బ్రిటిషర్స్ సికింద్రాబాద్‌ను నిర్మించారని, 1992లో ఐటీ పరిశ్రమలకు నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి ఐటీ పరిశ్రమను అభివృద్ధి చేసి సైబరాబాద్‌ను నిర్మించారని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు తాము నాలుగో నగరం ఫ్యూచర్ సిటీ నిర్మించాలనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. చైనా ప్లస్ 1 కంట్రీ కోసం అమెరికా, సౌత్ కొరియా ఇతర దేశాలు ఏవైతే ఎదురుచూస్తున్నాయో... వాటన్నింటి ప్రశ్నలకు ఆ ఫ్యూచర్ సిటీ సమాధానం చెబుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తమ చిత్తశుద్ధి ఏమిటో ఫ్యూచర్ సిటీ అభివృద్ధే నిరూపిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

**త్వరలోనే మరిన్ని ఒప్పందాలు.**
అమెరికా, దక్షిణ కొరియాల్లో పది రోజుల పర్యటన తర్వాత తాను ఈ రోజే తిరిగి వచ్చానని, అక్కడ తాము కలిసిన ప్రతి ఒక్క వ్యాపారవేత్త, కార్పోరేట్ లీడర్స్ తెలంగాణ, హైదరాబాద్ ల్లో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలంగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తమ పర్యటనల ద్వారా రూ.31,500 కోట్ల పెట్టుబడులు, 30,750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. పెట్టుబడులకు సంబంధించి సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. తెలంగాణకు మూడు రింగ్స్ ఉన్నాయని, మొదటిది కోర్ అర్బన్ ఏరియా హైదరాబాద్ అని, రెండోది అవుటర్ రింగు రోడ్డు-రీజినల్ రింగు రోడ్డు మధ్యన గల సెమీ-అర్బన్ ఏరియా అని, అక్కడ తాము తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మూడోది రీజనల్ రింగ్ రోడ్ బయట ఉన్న గ్రామీణ తెలంగాణ, అక్కడ అన్ని రకాల ఆధునిక సౌకర్యాలతో ఆసియాలోనే అత్యుత్తమ గ్రామాలను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పక్క రాష్ట్రాలతో పోటీ పడడం



నుంచి ప్రపంచంతో పోటీ పడేందుకు తమ ఆలోచనను ఎప్పుడో విస్తరించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**కాగ్నిజెంట్ విస్తరణకు పూర్తి మద్దతు.**
కాగ్నిజెంట్ విస్తరణకు పూర్తి మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో కాగ్నిజెంట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. హైదరాబాద్ లాగే కాగ్నిజెంట్ కూడా అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలోనే అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ గుర్తింపు పొందిందని ముఖ్యమంత్రి అన్నారు. 2002లో హైదరాబాద్ లో ప్రారంభమైన కాగ్నిజెంట్ లక్ష మందికి ఉద్యోగాలు కల్పించేలా ఎదిగిందన్నారు. ఫ్యూచర్ సిటీలోనూ కాగ్నిజెంట్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు.

**హైదరాబాద్ లాంటి నగరం ఎక్కడా లేదు.**
హైదరాబాద్ వంటి పారిశ్రామిక అనుకూల నగరం మరెక్కడా లేదనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తమకు ప్రపంచంతోనే పోటీ అని, పక్క రాష్ట్రాలకు హైదరాబాద్ వంటి నగరం, అవుటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, మంచి వాతావరణం లేవన్నారు. పరిశ్రమలు, సంస్థలకు ఇక్కడ తగినంత భద్రత, సంస్థలకు అవసరమైన యువశక్తి తెలంగాణలో ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే విధానం ఉండాలని తమ ప్రభుత్వం విశ్వసిస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు లేదని, ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో తమ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలనుకుంటోందన్నారు. పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు కావల్సిన అన్ని సౌకర్యాలు, అనుమతులు తాము కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు...**
**శ్రీధర్ బాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి**
ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఈ రోజు హైదరాబాద్ గురించే మాట్లాడుతున్నారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఒక్క రోజులోనే ఇక్కడ ఐటీ రంగం అభివృద్ధి చెందలేదని, 1992లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఐటీ పరిశ్రమలకు శంకస్థాపన చేస్తే తర్వాత పదేళ్లు పాలించినా మరో పార్టీకి చెందిన ముఖ్యమంత్రి, ఆ తర్వాత పదేళ్లు పాలించిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఇక్కడ ఐటీ పరిశ్రమను అభివృద్ధి చేశారని తెలిపారు. దావోస్ పర్యటనలో తాము కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్, ఈవీపీ సూర్య గుమ్మడితో క్యాంపస్ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పిలుపునకు స్పందించి ఆరు నెలల కాలంలోనే ఇక్కడ క్యాంపస్ విస్తరణ పూర్తి చేసి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచం నేడు ఏఐ,సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ వంటి విభిన్న రకాల ప్రతిభను అన్వేషిస్తోందన్నారు. అందుకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించేందుకు తమ ముఖ్యమంత్రి దృష్టిసారించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ క్రమంలోనే తాము ఏఐ సిటీ నిర్మించాలనుకుంటున్నట్లు వివరించారు.

**హైదరాబాద్‌లో మా నెట్వర్క్‌లో కీలకమైన హబ్: సూర్య గుమ్మడి, కాగ్నిజెంట్ ఈవీపీ ప్రెసిడెంట్ కాగ్నిజెంట్ అమెరికస్**
తమ నెట్వర్క్‌లో హైదరాబాద్ కీలకమైన హబ్ అని కాగ్నిజెంట్ ఈవీపీ, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి తెలిపారు. కాగ్నిజెంట్ నూతన ప్రాంగణం ప్రారంభం అనంతరం సూర్య గుమ్మడి మాట్లాడుతూ 2002 నుంచి కాగ్నిజెంట్ అభివృద్ధిలో కీలకమైన హైదరాబాద్‌లో నూతన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కేంద్రాన్ని ప్రారంభించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో భారతదేశంలో 2.40 లక్షల మంది, వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వెల్లడించారు. ఇందులో 39 శాతం మంది మహిళలేనని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడి అని, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, ఐవోటీలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు తమ హైదరాబాద్ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని సూర్య తెలిపారు. తెలంగాణలో విద్యా, నైపుణ్య శిక్షణ, సమాజ సంక్షేమం, పర్యావరణ సుస్థిరాభివృద్ధికి తాము కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. హైదరాబాద్‌తో తమ నూతన విస్తరణకు సహకరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూర్య గుమ్మడి కృతజ్ఞతలు తెలిపారు. కాగ్నిజెంట్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉందని, నైపుణ్యాభివృద్ధి, ప్రతిభను ప్రోత్సహించడం, సాంకేతికత, ఆవిష్కరణల విషయంలో కాగ్నిజెంట్ తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి వేముల శ్రీనివాసులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు క్యాథీ, జాన్‌కిమ్ తదితరులు పాల్గొన్నారు.

# 36 వేల కోట్ల పెట్టుబడులతో రికార్డు

**విశ్వంభర, హైదరాబాద్:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటన విజయవంతమైంది. పెట్టుబడుల లక్ష్య సాధనలో సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణకు భారీగా పెట్టుబడులు వెల్లువెత్తాయి. అమెరికా పర్యటనలో రూ.31,502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే స్పందన వెల్లువెత్తింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు ముందుకు వచ్చాయి. రూ.4500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనతో మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. మొత్తం 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరిలో దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొన్నారు. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులకు లైన్ కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో ఎనిమిది నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.76,232 కోట్ల మేర పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకోవటం సరికొత్త రికార్డు నమోదు చేసింది. దేశంలోనే పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా అటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్ టైల్ రంగాలపై దృష్టి సారించింది. వీటిలో ప్రపంచంలో దక్షిణ కొరియాకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఈ సందర్భంగా పలు కంపెనీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకోచ్చే కంపెనీలకు ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ను హైదరాబాద్లో ఏర్పాటు చేసి గ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటామని ప్రకటించింది. కంపెనీ కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందని అన్నారు.

వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో వస్త్ర తయారీ పరిశ్రమలు నెలకొల్పుతున్న యంగ్‌వన్ కంపెనీ హైదరాబాద్‌లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే 10 ఎకరాల స్థలాన్ని ఎయిర్‌పోర్ట్ కు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున సమ్మతించే లేఖను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి యంగ్‌వన్ ఛైర్మన్‌కు అందించారు.. కాస్మెటిక్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియా ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మెటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు పరస్పర సహకారం కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు అన్వేషించాలని కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్ తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది.

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్‌బాంగ్ ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. జేఐ టెక్ కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్ తో పాటు రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ. 100 కోట్ల పెట్టుబడులకు సిద్ధపడింది. చావి కంపెనీ హైదరాబాద్‌లో ఈవీ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాని తయారు చేయనున్నట్లు ప్రకటించింది.

ఎల్ ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శామ్సంగ్ సీ అండ్ టీ, శామ్సంగ్ హెల్త్ కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణలో తమ పెట్టుబడులకు అనువైన గమ్య స్థానంగా ఎంచుకోవాలని ఆహ్వానించారు.

పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియొచియోన్ స్ట్రీమ్ రీడెవలప్‌మెంట్, హాన్ రివర్‌ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టుకు వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆ ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీని ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవలి ఒలింపిక్స్ విజేతలెందరినో ఈ యూనివర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. కె.కేశవరావు రాజీనామాతో తెలంగాణలో రాజ్యసభ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. రాజ్యసభలోని 12 స్థానాల్లో ఉప ఎన్నికలు : రాజ్యసభలోని 12 స్థానాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాలకు చెందిన ఈ ఖాళీలకు సంబంధించి సెప్టెంబరు 3న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామఖ్య ప్రసాద్ తస(బీజేపీ), మీసా భారతి (ఆర్జేడీ), వివేక్ ఠాకుర్ (బీజేపీ), దీపేంద్రసింగ్ హుడా (కాంగ్రెస్), ఉదయన్ రాజే భోస్లే (బీజేపీ), కె.సి.వేణుగోపాల్ (కాంగ్రెస్), బిప్లబ్ కుమార్ దేబ్ (బీజేపీ) లోక్‌సభకు ఎన్నికయ్యారు. వారి రాజీనామాలతో రాజ్యసభలో ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కె.కేశవరావు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో, ఒడిశాలో బీజేడీ ఎంపీ మమతా మొహంత తన పదవికి, పార్టీకి రాజీనామా చేయడంతో ఆ స్థానాలకూ ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

# సుంకిశాల ఘటనపై ప్రభుత్వం సీరియస్

**విశ్వంభర, హైదరాబాద్:** సుంకిశాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. సుంకిశాల ప్రాజెక్టులో సైడ్ వాల్ కూలిన ఘటనపై జలమండ లి ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంది. ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్ 3లో పనిచేస్తున్న సీజీఎం కిరణ్ కుమార్, జీఎం మరియా రాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌లను సస్పెండ్ చేసింది. అలాగే నిర్మాణ సంస్థకు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సుంకిశాలలో ఏం జరిగిందంటే :** హైదరాబాద్‌కు తాగునీరు అందించే సుంకిశాల ప్రాజెక్టు వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ నీట మునిగింది. నాగార్జునసాగర్‌కు భారీగా వరద నీరు పోటెత్తడం, ఒక్కసారిగా పంప్‌హౌస్ రెండో సొరంగ మార్గం నుంచి ప్రవాహం ఉద్ధృతంగా రావడంతో టన్నెల్ ముందు భాగంలో నిర్మాణంలో ఉన్న గేటుతోపాటు రక్షణ గోడలోని ఒక ప్యానెల్ కొట్టుకుపోయాయి. దీంతో 83 మీటర్ల లోతులో ఉన్న పంప్‌హౌస్‌లోని సంపు పూర్తిగా నీటితో నిండిపోయింది. ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకన్నా తగ్గితే హైదరాబాద్‌కు నీటి తరలింపు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీరు తరలించేందుకు వీలుగా నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పాల్తితండాలో సుంకిశాల గట్టు వద్ద పంప్‌హౌస్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో జలమండలి శ్రీకారం చుట్టింది. 2021 మార్చి 16న ప్రభుత్వం మేఘా సంస్థకు పనులను కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. తొలుత రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో పనులు కేటాయించగా అక్టోబరు 2022లో వ్యయాన్ని రూ.2,214 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. పనులు 70 శాతం పూర్తయ్యాయి. వివిధ లోతుల్లో నీటిని తీసుకునేందుకు వీలుగా పంప్‌హౌస్ నుంచి మూడు సొరంగాలు(టన్నెళ్లు) నిర్మిస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 455 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మొదటి సొరంగాన్ని, 504 అడుగుల లోతు నుంచి తీసుకునేందుకు రెండోది, 547 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మూడోది నిర్మిస్తున్నారు.

**వరద అంచనాలు తప్పడంతో :** పంప్‌హౌస్, కృష్ణానదికి మధ్య కేవలం 192 మీటర్లు మాత్రమే దూరం ఉంది. వరద వచ్చిన సమయంలో ఆ ఉద్ధృతి తాకిడి పంప్‌హౌస్‌లోకి చేరకుండా రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు. వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మధ్య టన్నెల్ పనులు పూర్తిచేసే క్రమంలో సంపువైపు టన్నెల్ ముందు భారీ గేటు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికిగానీ మధ్య టన్నెల్ స్థాయి వరకు వరద రాదని భావించారు. 'దానికి భిన్నంగా దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో సాగర్ వద్ద అకస్మాత్తుగా ఒత్తిడి పెరిగి ఈ నెల 2న ఉదయం 7 గంటల సమయంలో టన్నెల్‌లోకి భారీ వరద చేరింది.

# హర్‌ఘర్ తిరంగ నినాదాలతో హోరెత్తిన వీధులు

**విశ్వంభర, ఆమనగల్లు / రాజంపేట/ హుజుర్‌నగర్** : ఆమనగల్లు పట్టణంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగ నినాదాలతో హోరెత్తింది. స్థానిక బీజేవైఎం ఆధ్వర్యంలో యువకులు విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీగా పుర వీధులలో తిరిగి వందేమాతరం, స్వాతంత్ర సమరయోధుల పేరులతో నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చౌరస్తాకు చేరుకొని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, స్థానిక ఎస్సై వెంకటేష్, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ, నాగర్కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్, బీజేపీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ సింగ్, కౌన్సిలర్సుందూరి శేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు నాగిళ్ళ బుచ్చయ్య, బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్, నాయకులు కటికల శ్రీశైలం యాదవ్, నాగిళ్ళ సందీప్, వరికిప్పల శ్రీనివాస్, పద్మ ప్రశాంత్, చెక్కల సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాజంపేటలో...**

హర్ ఘర్ తిరంగ అభియాన్ లో భాగంగా బీజేపీ రాజంపేట మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తిరంగ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటి మీద జెండా ఎగరవేయాలనే భారత ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు కామారెడ్డి నియోజకవర్గ శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ జండా వందనం కార్యక్రమంలో పాల్గొని దేశభక్తిని చాటాలని అన్నారు.

**హుజుర్‌నగర్ లో...**

హర్ ఘర్ తిరంగా యాత్ర అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజుర్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ కన్వీనర్ అంబళ్ళ నరేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి అధ్యక్షతన నిర్వహించిన తిరంగా యాత్రలో ముఖ్య అతిథిగా భారతీయ




జనతా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొబ్బా భాగ్యరెడ్డి, రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలతరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ పౌరులందరూ విధిగా తమ ఇంటి మీద, వ్యాపార సముదాయాల వద్ద విధిగా జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి విజయ్, గుండెబోయిన వీరబాబు, కుక్కడపు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి అంజయ్య, నరినాయక్, కుందూరు కోటిరెడ్డి, గుండ్రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, కీత శ్రీను, పార్ధనబోయిన విజయ్, దుండిగల ఎల్లయ్య, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఏజీపీగా పంబాల వేణుగోపాల్



**విశ్వంభర, డిండి:** నల్లగొండ జిల్లా దేవరకొండ తాలుకా డిండి మండలం టీ గౌరారం గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది పంబాల వేణుగోపాల్ ను హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఏజీపీ గా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దళిత నిరుపేద కుటుంబానికి చెందిన పంబాల కాశమ్మ, వెంకటయ్య దంపతులకు జన్మించిన పంబాల వేణుగోపాల్ దేవరకొండ పట్టణంలో ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఏంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఎల్ ఎల్ బీ, ఎల్‌ఎల్‌ఎం న్యాయవాద విద్యను ఉస్మానియా యూనివర్సిటీ లో చదివారు. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ బార్ కౌన్సిల్ లో తన పేరు నమోదు చేసుకుని న్యాయవాదిగా నాంపల్లి కోర్టులో పని చేశారు. ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కోసం తెలంగాణ హైకోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు ఏజీపీ పంబాల వేణుగోపాల్ మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వర్తిస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ భాధ్యతను అప్పగించిన న్యాయ అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఏజీపీగా పంబాల వేణుగోపాల్ నియామకంపై నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.

# పోచమ్మ గుడికి ఆశాదీప్‌రెడ్డి విరాళం



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ గుడి నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర గ్రామానికి చెందిన కాయితి ఆశాదీప్ రెడ్డి తన వంతుగా 20 వేల రూపాయలు పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాప వెంకట్ రెడ్డి, కాయితి జయంత్ రెడ్డి, గంగాపురం యాదగిరి, నక్క మల్లికార్జున్, జక్కుల మల్లేష్ యాదవ్ ఉన్నారు.

# ఎండోమెంట్ అసిస్టెంట్ కమీషనర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు



**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా ఎండోమెంట్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ కమీషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన సుప్రియని టీఎన్జీవోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా సంఘం అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంఘం కార్యదర్శి రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్, భరద్వాజ్, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల అనిల్ కుమార్, ఉద్యోగులు మారుతి పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ పై చర్యలు తీసుకోవాలి




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఏజెన్సీ భద్రాచలంలో త్రివేణి స్కూల్ యాజమాన్యం నాణ్యమైన విద్య పేరుతో విద్య హక్కు చట్టానికి విరుద్ధంగా ఫీజులు ఎక్కువగా తీసుకుంటున్నారని, ఈ విషయం ఉన్నత అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ అన్నారు. భద్రాచలం పట్టణంలో ఉన్న పేద ప్రజల నుండి అధిక ఫీజులు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ పర్మిషన్లు తీసుకునేటప్పుడు ఏజెన్సీ అని వాటికి లోబడి ఫీజుల తీసుకోవాలని అధికారుల ఆదేశించినప్పటికీ అవన్నీ తుంగలో తొక్కి అధికారులకు తెలిసిన స్కూలు యాజమాన్యం విద్యాశాఖ అధికారులని మేనేజ్ చేస్తూ స్కూల్ నడుపుతున్నారని మండిపడ్డారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఫీజుల వివరాలను నోటీస్ బోర్డ్ లో పెట్టాలని తెలిపారు. త్రివేణి విద్యా సంస్థ నోటీస్ బోర్డ్ లో ఫీజుల వివరాలు పెట్టకపోగా, బుక్స్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. త్రివేణి విద్యా సంస్థపై మండల, జిల్లా విద్యాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ స్కూలుపై ఏసీబీ దాడులు చెయ్యాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# చిన్నారికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన 4 సంవత్సరాల చిన్నారి చిటికెల అక్షిత పుట్టు మూగ గా జన్మించింది. ప్రస్తుతం ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ని కలవడంతో ఆయన స్పందించి 15వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని చెక్ రూపకంగా అందించారు. భవిష్యత్తులో చిన్నారి అక్షిత చదువుకు అన్ని రకాలుగా అండగా ఉంటానని ఉప్పల వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుమణి శ్రీశైలం గౌడ్, శేఖర్ యాదవ్, తుమ్మ రమేష్, కనుక వెంకటయ్య, మల్లేష్ బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్, సిద్ధగోని నరేష్, తుర్కలపల్లి గ్రామస్తులు రామకృష్ణ, శేఖర్ గౌడ్, నాగరాజు, బుచ్చిబాబు పాల్గొన్నారు.




# బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు



**విశ్వంభర, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ మున్సిపాలిటీ లోని కోటార్మూర్ (పెర్కిట్)కి చెందిన దొండ రాములు ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈ విషయాన్ని 5వ వార్డు కౌన్సిలర్ శాల ప్రసాద్ వినయ్ కు చరవాని ద్వారా విషయాన్ని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో దొండ రాములు చికిత్స కోసం స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2,50,000 వేల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ ఓసీ అందించడం జరిగింది. అదేవిధంగా చికిత్సకు కావలసిన ఏర్పాట్లు చేసి నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా కొర్ర నరేష్



**విశ్వంభర, నారాయణపూర్** : నారాయణపూర్ మండల అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మండల సూపరింటెంట్, ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా నారాయణపురం గ్రామానికి చెందిన కొర్ర నరేష్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి మెరుగు సత్యం, కోశాధికారి జ్యోతిర్మయి, ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బ్రహ్మచారి, కృష్ణ, చంద్రశేఖర్, లచ్చిరాం, లింగస్వామి, మహబూబ్, ఉషయ్య, శ్రీనివాస్, సతీష్, సువర్ణ, పర్వీన్ పాల్గొన్నారు.



**కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలం ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అశోక్ సంఘవా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి పూర్తి వివరాలకు తెలుసుకున్నారు. తర్వాత బీసీ హాస్టల్ ను తనిఖీ చేశారు.**

**- విశ్వంభర, కామారెడ్డి**




**వికారాబాద్ జిల్లా నవాబుపేట్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్ బుధవారం వికారాబాద్ డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.**

**- విశ్వంభర, వికారాబాద్**

## నెహ్రూ స్వార్ధ రాజకీయాల వల్లే

# దేశం రెండు ముక్కలైంది

**బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార**

**విశ్వంభర, కామారెడ్డి:** బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కార్యాలయంలో దేశ విభజన గాయాల స్మారక దినం కార్యక్రమం అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణా తార మాట్లాడుతూ నెహ్రూ స్వార్ధ రాజకీయాల వల్లే నాడు దేశం రెండు ముక్కలైందని తాను ప్రధాని కావడం కోసమే దేశ విభజనకు అంగీకారం తెలిపాడని అన్నారు. దేశ విభజన సమయంలో లక్షలాది మంది హిందువులు ఊచకోతకు గురయ్యారని ఆ గాయాలను నేటికీ భారతదేశం మరవలేదని అన్నారు. అందుకే నిన్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ విభజన గాయల స్మారక దినంగా ఆగస్టు 14 రోజున అప్పుడు ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించాలని సూచించారని అన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు దేశానికి ప్రమాదకరం అని అన్నారు. బం




గ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను బీజేపీ ముక్త కంఠంతో ఖండిస్తుందని అన్నారు. హిందువులకు మద్దతుగా సీఏఏ చట్టాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం విభజన సందర్భంగా చనిపోయిన వారికి నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు.

## సీఆర్‌పీఎఫ్ 217 బీఎన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ



విశ్వంభర, ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్ ప్రభావిత ప్రాంతమైన సుక్మా జిల్లా కొంట పోలీస్ స్టేషన్ ఆద్వర్యంలో ఆజాదీకి అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆప్స్ రేంజ్ కొంటా సీఆర్‌పీఎఫ్ 217 బీఎన్, సీఆర్‌పీఎఫ్ అధికారులు, కొంటా డీ.ఏ.వీ. పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, సబార్డినేట్ అధికారులు, జవాన్లు పాల్గొని ర్యాలీ కూడా నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా గ్రామస్తులకు, పిల్లలకు తిరంగ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూరజ్ పాల్ వర్మ, కొంటా డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) రేంజ్, సీఆర్‌పీఎఫ్, కమాండెంట్ 217 బీఎన్ సీఆర్‌పీఎఫ్ శ్రీ విజయ్ శంకర్ స్వాతంత్ర్యం, దేశభక్తి యొక్క ప్రాముఖ్యత గురించి జవాన్లు, విద్యార్థులు మరియు గ్రామస్తులకు వివరించారు.

## న్యాయవాది సగరపు ప్రసాద్ కాంగ్రెస్‌లో చేరిక

**విశ్వంభర, చివ్వేంల** : చివ్వెంల మండల పరిధిలోని మోదిన్ పురం గ్రామానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది సగరపు ప్రసాద్ వివిధ పార్టీలకు చెందిన 600 మంది కార్యకర్తలతో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేనారెడ్డిలు పార్టీ కడువా కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. అంతకుముందు మోదిన్ పురం నుండి నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్లు, ఆటోలు, మోటార్ సైకిల్ పై భారీ ర్యాలీ నిర్వహిస్తూ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి దామోదర్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువత ఉన్నత చదువులు చదివిన వారికి పెద్ద పీట వేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దామోదర్ రెడ్డి సూర్యాపేట నియోజకవర్గంలో ఎంతోమంది యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ప్రోత్సాహించారని గుర్తు చేశారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. పార్టీలో పాత నాయకులను ఐక్యం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సగరపు ప్రసాద్ కు రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి సరైన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యువత భారీగా సభ్యత్వాలు తీసుకొని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎలిమినేటి అభినయ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, చత్రు నాయక్, నాయకులు కొడితల వెంకన్న, బోళ్ల రమణమ్మ, మస్తాన్, కన్నం జానయ్య, ఎల్లా చారి, చెరుకు సుధాకర్, చీము వీరయ్య, చీమ సుధాకర్, భూక్య సైదా, పరిసయ్య, చిన్న వెంకన్న, శాంతి, నాగరాణితో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఎంకి టీఎన్జీవో కేంద్ర సంఘం కృతజ్ఞతలు



**విశ్వంభర, హైదరాబాద్:** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగల సమాఖ్య జాతీయ కౌన్సిల్ సమావేశాలు హైదరాబాదులో తేదీ 13,14 ఆగస్టు 2024 లో జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి శ్రీకుమారన్ ఆధ్వర్యంలో జరిగాయి. 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరుకాగా తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ఉపాధ్యక్షులు ఎస్ ఎం హుసేన్, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజులు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కామ్రేడ్ సుభాష్ లాంభ, ఏ శ్రీకుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు దేశములో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు ఎదుర్కుంటున్న ఉద్యోగులు సమస్యలను సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గాలను నిర్దేశించారు. తదుపరి టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజుబ్ మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి అన్ని సమస్యలు పరిష్కరించుకుంటామని చెప్పారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ లో ఉన్న డీఏ ల విడుదల, నూతన వేతన సవరణ, నూతన క్యాడర్ సెండ్, ఉద్యోగుల ఆరోగ్య భద్రత పథకం లాంటి అనేక సమస్యలు తెలంగాణ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం చేసుకుంటామని తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొని రావడానికి విజ్ఞప్తి చేసిన వెంటనే ఆమోదం తెలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమ్మతి లేఖను రాయడం మంచి పరిణామం అన్నారు. గత కేసీఆర్ సర్కార్ దశాబ్దికాలంగా పట్టించుకోని సమస్యను మానవతా దృక్పథంతో రేవంత్ రెడ్డి పరిష్కరించి వారిని తెలంగాణకు తీసుకు వస్తున్నందుకు టీఎన్జీవో కేంద్ర సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. జాతీయ కార్యవర్గ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కే శ్రీకాంత్, పి హరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్ పాల్గొన్నారు.



## పాలమూరు రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం

**- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**విశ్వంభర, హైదరాబాద్:** సామాజిక సేవలో పాలమూరు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్, విశ్రాంత ఐ.ఎ.ఎస్ అధికారి అజయ్ మిశ్రా, గవర్నర్ కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ జి. రమణయ్యలు హైద్రాబాద్ లోని రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గవర్నర్ జిష్ణు దేవ వర్మను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి రాష్ట్ర గవర్నర్ తెలుసుకొని అభినందించారు. సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించి పేదలకు చేరువ కావాలన్నారు.



## బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ యాత్ర

**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు కాలేజీల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఒక్కంటి దయాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరాల మహేష్, జిల్లా కార్యదర్శి జూల సందీప్, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల విజయ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ శ్యామ్ కిరణ్ రెడ్డి, నాగదీప్ గౌడ్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, క్రాంతి యాదవ్, సాయి ప్రకాష్ సీతారామరెడ్డి, పలు డివిజన్ల బీజేపీ అధ్యక్షులు పత్తి సతీష్, సాయినాథ్ నేత, మున్సిపల్ అధ్యక్షులు కంది శ్రీరాములు, కౌన్సిలర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూత



**విశ్వంభర, నాగోల్:** రామంతపూర్ డివిజన్ కి చెందిన నాను ప్రకాశ్ సుజాత ల కుమార్తె సోనీ వివాహం కోసం, కామారెడ్డి జిల్లా పల్వంచ మండలం సింగాయి పల్లి గ్రామానికి చెందిన జోడీ రామాగౌడ్ నర్సవ్వ దంపతుల కుమార్తె వెంకట లక్ష్మీ వివాహానికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులు టిపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నాగోల్ లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన వారికి పూస్తే మట్టెలు చీర గాజులు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు కుమార్, నగేష్, కిషన్ గౌడ్ పాల్గొన్నారు.



హైదరాబాద్ రాజ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

- విశ్వంభర, హైదరాబాద్




మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా పిడమర్తి నరేష్ పదవీ భాద్యతలు చేపట్టారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిడమర్తి నరేష్ బదిలీపై మలక్‌పేట్ ఇన్స్పెక్టర్‌గా వచ్చారు.

- విశ్వంభర, మలక్ పేట్

## కరోనా కాలంలో నిలిచిన ఐదు రైలు సర్వీసులను పునరుద్ధరించాలి

**○ దక్షిణ మధ్య రైల్వే జీఎంతో భేటీలో కోరిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**



**విశ్వంభర, సికింద్రాబాద్:** ఉభయ జిల్లాలకు సంబంధించి పలు రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ను కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఆయనతో భేటీ అయ్యారు. పలు గ్రామాలను అనుసంధానించే రోడ్డు కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో చాలా ఇరుకుగా ఉందని, దీని విస్తరణ అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని ప్రస్తావించారు. రైల్వేకి సంబంధించిన స్థలాన్ని రోడ్డు విస్తరణకు కేటాయించాలని, ఇందుకోసం కేంద్ర రైల్వే మంత్రిని సంప్రదించి వివరిస్తానని తెలిపారు. కోవిడ్ ఆపత్కాలంలో నిలిచిపోయిన, ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఆ సర్వీసులను పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. మణుగూరు ఖాజీపేట (వయా భద్రాచలం రోడ్), డోర్నకల్ భద్రాచలం రోడ్, బెల్గాం భద్రాచలం రోడ్, ఖాజీపేట విజయవాడ, విజయవాడ పెద్దపల్లి రైలు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని జీఎంను కోరారు. సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్ రైలును మణుగూరు వరకు పొడిగించాలని జీఎంను కోరారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం స్పందిస్తూ తప్పకుండా ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని జీఎం అరుణ్ కుమార్ జైన్ ఎంపీకి హామీ ఇచ్చారు.

## వోల్టా ఓహెచ్ఎమ్ ఆటోమోటివ్ భాగస్వామ్యం




**విశ్వంభర, బషీర్ బాగ్:** వోల్టా, రైడ్ బుకింగ్ యాప్ వ్యవస్థాపకుడు షషికాంత్ కనపర్తి, సీఈఓ రాజా విక్రమ్ నేతృత్వంలోని వినూత్న రైడ్‌హైలింగ్ యాప్ ఓహెచ్ఎమ్ ఆటోమోటివ్‌తో కలిసి కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా అందరికీ విలాసవంతమైన, సౌకర్యవంతమైన, పర్యావరణ అనుకూల రవాణా సేవలను అందించడంలో ముందడుగు వేసింది. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్‌కి కేవలం రూ. 799 నుండి ప్రారంభం అయ్యే రైడ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. అదనంగా, వోల్టా ఓహెచ్ఎమ్ నగరంలో సులభమైన స్థానిక రైడ్‌లను కూడా అందించనున్నాయని పేర్కొన్నారు. నిర్మల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి నేతృత్వంలోని ఓహెచ్ఎమ్ ఆటోమోటివ్, జీఎమ్ఆర్ అనుమతించిన ఎయిర్‌పోర్ట్ సిటీ సేవల కోసం, అంతర్గత నగర రవాణా కోసం, ఓహెచ్ఎమ్ ఎలక్ట్రిక్ క్యాబ్‌లను ప్రారంభించింది. 600 కంటే ఎక్కువ వాహనాలతో, ఓహెచ్ఎమ్ పర్యావరణ హిత రవాణా పరిష్కారాలను అందించడంలో ముందుందని ప్రకటించింది. ఓహెచ్ఎమ్ ఆటోమోటివ్ వ్యవస్థాపకుడు నిర్మల్ రెడ్డి మాట్లాడుతూ తమ కస్టమర్‌లకు శుభ్రమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాలను అందించడం తమ మిషన్ లక్ష్యం అన్నారు. వోల్టాతో భాగస్వామ్యం ద్వారా తమ సేవలను మరింత విస్తరించ గలుగుతున్నామని అన్నారు.

## వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార సహ ప్రముఖ్‌గా రేగు అనిల్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** విశ్వ హిందూ పరిషత్ ప్రచార, ప్రసార విభాగం తెలంగాణ రాష్ట్ర సహ ప్రముఖ్ (రాష్ట్ర అధికార ప్రతినిధి) గా రేగు అనిల్ నియమితులయ్యారు. కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ శిశు మందిరంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థాగతమైన పలు మార్పులు చేశారు. అందులో భాగంగా ప్రచార ప్రసార విభాగంలో ప్రాంత సహ ప్రముఖ్ గా రేగు అనిల్, ప్రాంత సోషల్ మీడియా ప్రముఖ్ గా ధీరజ్ లను నియమిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ భోజనపల్లి నరసింహా మూర్తి బాధ్యతలను ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్కరం ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం

**విశ్వంబర, ఎల్బీనగర్:** దేశ ప్రధాని మోడీ పిలుపు మేరకు 78 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుదామని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితమే దేశానికి స్వతంత్రం వచ్చిన రోజు అని అన్నారు. వారి ఆశయ సాధనకు మనమందరం కృషి చేద్దాం అని అన్నారు.



## మాజీ గ్రంథాలయ చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, ఎల్బీనగర్:** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ ను మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి బుధవారం ఆర్కేపురంలోని ఓజోన్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విరమల్ల రామ్ నర్సింహ గౌడ్, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్ ఉన్నారు.



## క్షత్రియులకు భవన నిర్మాణ స్థలాన్ని కేటాయించాలి

**18న ముఖ్యమంత్రికి అభినందన సభ**




**విశ్వంభర, ఖైరతాబాద్:** క్షత్రియ కులస్తులకు భవన నిర్మాణం కోసం హైదరాబాద్ నగరంలో స్థలాన్నికేటాయించాలని క్షత్రియ సేవా సమితి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సేవా సమితి అధ్యక్షుడు పర్చోర్ల నాగరాజు మాట్లాడుతూ 1961 సంవత్సరంలో క్షత్రియ సేవా సమితి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి సంవత్సరం సేవా దృక్పథంతో పేదలకు, విద్యార్థులకు, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. క్షత్రియ సామాజిక వర్గంలో 70 శాతం పేదలు ఉన్నారని, వారి అభ్యున్నతి కొరకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి తాము పని చేస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగానే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ బాధలు విన్నవించామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు పేరు మీద క్షత్రియ భవనానికి స్థలం కేటాయించడం, తెలంగాణలో అన్ని కులాలకు ఏర్పాటు చేసిన విధంగానే క్షత్రియులకు కూడా క్షత్రీయ కార్పొరేషన్ ఏర్పాటు అంశాలు ఉన్నాయని అన్నారు. ఆగస్టు 18న గచ్చిబౌలి, జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రఘురామరాజు, వెంకటేశ్వరరాజు, కోశాధికారి వెంకటేశ్వరరాజు, భూపతి రాజు రాజేంద్ర రాజు, రామకృష్ణ రాజు, జగపతి రాజు, గడి రాజు మూర్తి రాజు పాల్గొన్నారు.

## భారత్ పెట్రోల్ పంప్ సెంటర్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, ఉప్పల్ :** బ్రిటీష్ సామ్రాజ్యవాదులను మన దేశం నుండి ప్రారదోలిన రోజును స్వతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నట్టుగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తెలిపారు. ఉప్పల్ లోని భారత్ పెట్రోలియం పంప్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. భారత దేశ విభజనకు గురైన రోజు ఆగస్టు 15 అని అప్పటి ప్రధాని నెహ్రూ ఒప్పుకున్నాడని మత ప్రాతిపదికన బ్రిటిష్ వాళ్ళు భారత దేశాన్ని భారత దేశం, పాకిస్తాన్ గా చిత్రీకరించి విడదీశారని అన్నారు. ఈ విభజన గూర్చి ప్రజలకు తెలియజేయడం వల్ల ప్రజలకు భారతదేశ ప్రతిష్ట అర్థమవుతుంది అని తెలిపారు. భౌగోళికంగా విభజిస్తున్నాము అని తెలిపినప్పటికీని నలంద, తక్షశిల లాంటి యూనివర్సిటీలు పాకిస్తాన్లోనే ఉండిపోయాయని తెలిపారు. రాముని పుత్రులైనటువంటి లవకుశల యొక్క ప్రాంతం లాహోర్ పాకిస్తాన్లోనే ఉండిపోయింది అని గుర్తు చేశారు. ఈ రకంగా భౌగోళికంగా విభజన చేశారు కానీ సాంస్కృతికంగా మాత్రం విభజన కాలేదని అన్నారు. కాబట్టి భారతదేశన్ని విచ్ఛిన్నం చేసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భారతదేశము యొక్క సమగ్రతను కాపాడాలని కోరారు. స్వతంత్ర దినోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా ఘర్ ఘర్ తిరంగా ఏర్పాటు చేసుకొని మన ఐక్యమత్యాన్ని చాటాలని తెలిపారు. భారతదేశమంటే సర్వమత సమ్మేళనం అని, భారతీయుడుగా పుట్టడం మన అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ భారత్ పెట్రోల్ పంప్ యాజమాన్యం బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నుండి కాపాడాలని, రంగారెడ్డి జిల్లా కోర్టులో నేషనల్ అడ్వకేట్ ఫోరం, భారతీయ న్యాయవాద సేనా ఆద్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జాతీయ జెండాలతో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంగ్లాదేశ్ హిందువులకు సంఘీభావం తెలిపారు.

- విశ్వంభర, ఎల్బీనగర్



## రోగులకు మెరుగైన
# వైద్య సేవలు అందించాలి
### - కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, బ్లడ్ బ్యాంక్, ప్రసూతి వార్డు, లేబర్ రూమ్, ప్లేట్ లెట్ మిషన్, ఐసీయు, జనరల్ వార్డు లను పరిశీలించి వైద్య సేవలకు వచ్చిన పలువురితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైరల్ జ్వరాలతో ఆసుపత్రికి వస్తున్న వ్యాధి గ్రస్థుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు విధులలో అందుబాటులో ఉండాలని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాల బారిన పడిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉంటూ కావలసిన మందులను, విష సర్పాల కాటుకు, కుక్క కాటుకు కావలసిన వాక్సిన్లు అన్నిప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి కోసం తహసీల్దార్‌కి వినతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో బుధవారం మాజీ జడ్పీటీసీ సభ్యులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ఆధ్వర్యంలో రైతులు బునాదీ గానీ కాల్వలోకి నీటిని విడుదల చేయాలని మండల తహసీల్దార్ ద్వారా కలెక్టర్ కి అందచేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఆత్మకూరు (ఎం) మండలలో వర్షాలు లేక భూగర్భ జలాలు ఇంకిపోయాయని వంటలు పండించుకోవడానికి ఇబ్బందిగా ఉందని రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో మా ప్రాంతానికి బునాది గాని కాలువ త్రవ్వి గత సంవత్సరం ట్రాయల్ రన్ కింద నీరు వదిలారని రైతులు తెలిపారు. ప్రస్తుతం చెరువు కుంటలలో బావులలో నీరు లేక రైతాంగం తల్లడిల్లి పోతున్నారని అన్నారు. బునాది గాని కాలువకు నీరు వదిలినట్లయితే మండలంలోని అన్ని గ్రామాల చెరువు కుంటలు నిండి రైతులు సస్యశ్యామలంగా పంటలను పండించు కుంటారని తెలిపారు. కాలువకు మూసీ నీరును గాని గోదావరి జలాలను గాని వదిలి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు మరియు ఆత్మకూరు (ఎం) మండలం రైతులు తహసీల్దార్ వినతి పత్రం అందించారు.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



**విశ్వంభర, గొల్లపల్లి:** గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హాస్టల్ లో ఫుడ్ పాయిజన్‌తో ఐదుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సిబ్బంది 108 వాహనంలో జగిత్యాల జిల్లా ఆసుపత్రికి తరలించి ఆక్సిజన్ ద్వారా వైద్యం అందిస్తున్నారు. కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విషయం తెలిసిన వెంటనే జగిత్యాల జిల్లా కేంద్రంలో గల ఎం.సీ.హెచ్ మాతా శిశు సంక్షేమ కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శించి గురుకులాలను ప్రక్షాళన చేస్తాం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే మరొక గురుకులంలో విషాద సంఘటనలు చోటు చేసుకోవడం విద్యార్థుల తల్లిదండ్రులకు గురుకులాలు అంటేనే భయపడే పరిస్థితి నెలకొందని అన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తో పాటు జగిత్యాల మాజీ జడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అధికారులతో కలెక్టర్ సమావేశం

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** అన్ని పాఠశాలల విద్యార్థులకు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య, పంచాయతి రాజ్, మున్సిపల్, సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు పరీక్షలు నిర్వహణలో వ్యాధులు ప్రబలిన విద్యార్థుల వివరాల నివేదికలు అందచేయాలని ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు పెంచాలని సూచించారు. వ్యాధులు ప్రబలే కాలమని వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. అన్ని ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను తనిఖీ చేయాలని, వైద్య పరీక్షల ధరల పట్టిక ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సర్క్యులర్ జారీ చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. మలేరియా, డెంగీ కిట్లు అందుబాటులో ఉంచాలని, ఎలీసా పరీక్షలు నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అటవీ అధికారి సునీత, అదనపు కలెక్టర్ వేముకటేశ్వర్లు, డీపీఓ నారాయణ రావు, వైద్యాధికారి డా.మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ రావు, బీసీ సంక్షేమ అధికారి శైలజ, ఎస్పీ అభివృద్ధి అధికారి సునీత, డీఆర్డీఓ నరేష్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి పాల్గొన్నారు.



## ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన
# అన్ని హామీలు నెరవేరుస్తాం
○ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు పరిష్కరిస్తామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో నిర్మించిన గెజిటెడ్ అధికారుల కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గెజిటెడ్ అధికారులు కమ్యూనిటీ భవనం నిర్మించుకోవడం చాలా సంతోషమన్నారు. జడ్పీ కార్యాలయం, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మన జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలున్నాయని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొడవటన్చ ఆర్చి నుండి చల్లగరికే వరకు రహదారి నిర్మాణానికి 90 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొడవటన్చ దేవాలయం అభివృద్ధి కి 12 కోట్ల 15 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. 3వ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేస్తున్నామని అన్నారు. 4,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కనున్నాయని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని సమస్యలు నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వానికి తోడుగా అండగా నిలవాలని అన్నారు. పెన్షనర్లుకు భవనం మంజూరు చేస్తామని అన్నారు. గెజిటెడ్ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని అన్నారు. మీ అందరి దీవెనలతో శాసనసభ్యడను అయ్యాయని, మీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉద్యోగులు ఏదేని సమస్య వస్తే తన దృష్టికి తేవాలని అన్నారు. అధికారులు ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గెజిటెడ్ సంగం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పనిచేసినప్పుడే ఉద్యోగులకు గౌరవం ఉంటుందన్నారు. ఉద్యోగస్తులు సమిష్టిగా పని చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

అభివృద్ధిలో కీలకపాత్ర ఉద్యోగస్తునేనని అన్నారు. ఈ కార్యక్రమంలోసత్యనారాయణ, స్టేట్ సెంట్రల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, స్టేట్ సెంట్రల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జగన్మోహన్ రావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్మన్ వెంకట రాణి సిద్దు, వైస్ ఛైర్మన్ హారీష్ రెడ్డి, కౌన్సిలర్ లల్ బద్ది సమ్మయ్య, టీజీవో మాజీ కార్యదర్శి ఆంజనేయులు, కార్యదర్శి సంజీవ రావు, వరంగల్ జిల్లా టీజీవో అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, హన్మకొండ టీజీఓ జనరల్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## గంజాయి విక్రయంపై పోలీసు ఉక్కు పాదం



**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడవి ముత్తారం మండలం జీలపల్లి గ్రామానికి చెందిన తైనేని రాంబాబు, కొర్లకుంట గ్రామానికి చెందిన లౌడియ తిరుపతి, వాంకుడోత్ వంశీలు మాదారం జిలపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలోని బ్రిడ్జి వద్ద గంజాయి సేవిస్తున్నారు. నమ్మదగిన సమాచారం వేరకు అడవి ముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తన సిబ్బందితో కలిసి గంజాయి సేవించడం కోసం వచ్చిన వారిని తనిఖీ చేయగా 435 గ్రాముల గంజాయి దొరికినట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు కాటారం సిఐ నాగార్జున రావు తెలిపారు. పిల్లలు గంజాయికి అలవాటు పడకుండా తల్లిదండ్రులు చూడాలని, గంజాయికి అలవాటు పడిన వారిని తమ వద్దకు తీసుకువస్తే కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. నిషేదిత గంజాయిని సేవించడం వల్ల పిల్లల భవిష్యత్తు అంధకారంలో మునిగిపోతుందని తమ దృష్టికి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకొని అరెస్టు చేస్తామని కాటారం ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు.

## వేతనాలు చెల్లించేంతవరకు
# సమ్మె విరమించేది లేదు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం ఆస్పత్రి కార్మికుల వేతనాలను చెల్లించేంతవరకు సమ్మె విరమించేది లేదని కార్మికులు చేస్తున్న పోరాటానికి సీపీఐఎం సంపూర్ణ మద్దతు ఇచ్చి అండగా నిలుస్తుందని సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని రెండవ రోజు సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మచ్చ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉండటం వలన కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై, ఇంటి అద్దెలు కట్టలేక కిరాణా సరుకులు కొనలేక అప్పులు ఇచ్చేవారు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులు అనివార్య పరిస్థితులలో సమ్మెకు దిగారని కనీస వేతనం 26,000 ఇవ్వాలని చెప్పి అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్న పని భద్రత కల్పించాలని ఈఎస్ఐ సౌకర్యం పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నా గత ప్రభుత్వంగాని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంగాని కార్మికుల సమస్యలను పెడచెవిన పెడుతున్నదని విమర్శించారు.

ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వెంటనే మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం బి నర్సారెడ్డి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సీపీఐ ఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి సీఐటీయు పట్టణ నాయకులు బి శరత్ బాబు, వైవి రామారావు, పి సంతోష్, నాగరాజు, లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రమాదేవి, రమణమ్మ, గీత, నిర్మల, కుమారి, మెహబూబ్, నాగరాజు, నరసింహారావు, నరేంద్ర, భాస్కర్, రమేష్ కార్మికులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలు ఏర్పాట్లు పూర్తి
### - కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వేడుకలు నిర్వహణపై మినిట్ టు మినిట్ షెడ్యూల్ తయారు చేశామని, అట్టి షెడ్యూల్ ప్రకారం వేడుకలు నిర్వహణ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోదెం వీరయ్య ముఖ్య అతిథిగా ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. పటిష్ఠ భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు, రిహార్సల్స్ తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జెండా ఆవిష్కరణ, ముఖ్య అతిధి ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, ఆనంతరం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు అందించే ప్రసంసాపత్రాలు ప్రధానాలను అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎలాంటి సమస్యలు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. వేడుకలకు వచ్చే ప్రజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించే విద్యార్థులకు త్రాగునీరు, ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాళ్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అసెట్స్ పంపిణి చేయనున్నందున ఆయా శాఖల అధికారులు లబ్ధిదారులతో అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఎస్పీపీఆర్ఓ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనీ కాకతీయ ప్రెస్ క్లబ్ లో జిల్లా ఎస్పీ పీ.ఆర్.ఓ తాళ్ల పెల్లి రామారావు జన్మదిన వేడుకలను జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, జెల్ది రమేష్, మహమ్మద్ వలి, బండారి రాజు, సలుపాల తిరుపతి, ఆకుతోట ప్రవీణ్, వడ్లూరి సతీష్, బెల్లం తిరుపతి, రాచర్ల సుధాకర్, కొంకుల సాంబయ్య, బండ మోహన్, రాపర్తి పవన్, మేచినేని పూర్ణ చంద్రరావు, కల్వచర్ల కృష్ణమూర్తి, కట్కూరి రమేష్, బత్తుల మల్లేశం, అడ్డగట్ల శ్రీను పాల్గొన్నారు.





## పేదరిక నిర్మూలనే లక్ష్యం
## - లయన్స్ క్లబ్

**విశ్వంభర, ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో లయన్స్ సేవలను మరింత విస్తృత పరిచి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తామని ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని భవాని గార్డెన్లో లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంవత్సరిక ప్రణాళికను క్లబ్ అధ్యక్షులు సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత మెగా హెల్త్ క్యాంపులను కంటి ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సంవత్సరం అత్యధికంగా మేఘా కంటి వైద్య శిబిరాలను నిర్వహించి పేద ప్రజలకు సేవలు అందించేలా కృషి చేస్తామని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ ఆమనగల్లు కు అంతర్జాతీయ స్థాయిలోనే అగ్ర భాగాన నిలుపుతామని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో పాఠశాలలకు వాటర్ ట్యాంకులు, విద్యార్థి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ మాజీ గవర్నర్ సందడి నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్ మాజీ గవర్నర్ జీ చెన్న కిషన్ రెడ్డి, రామ్ రెడ్డి, లయన్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్, వి దామోదర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేష్, కోశాధికారి గుజ్జరి నరసింహ, జిల్లా చైర్మన్ లు జూలూరు రమేష్, బండేలా రామచంద్రారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

## షకీల్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన షకీల్ బ్రెయిన్ సర్జరీతో ఓవైసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో షకిల్ కుటుంబ సభ్యులను పరామర్శించి 15,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్జల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ అంబాజీ మాజీ ఉపసర్పంచ్ లు బోయ నర్సింహులు, ఎం.ఏ. అజిజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అబ్బాస్, బి సుధాకర్ రాజు ముజీబ్, ఖదీర్ పాల్గొన్నారు.

## విభజన గాయాల స్మారక దినం

**విశ్వంభర, మెట్ పల్లి :** నరేంద్ర గార్డెన్ లో మెట్ పల్లి నియోజకవర్గ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో విభజన గాయాల స్మారక దినం 14 ఆగస్టు సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరైనారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు విభజన జరిగిన నష్టాన్ని మన దేశాన్ని జరిగిన గాయాన్ని పలువురు క్లుప్తంగా వివరించారు. విభజన గాయాల స్మారక దినం పురస్కరించుకొని దీనిపై పూర్తిగా అవగాహన చేసి ఉపన్యాసించిన వక్తలను ఎంపీ అరవింద్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, జిల్లా జనరల్ సెక్రెటరీ యాదగిరి బాబు, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, అధికార ప్రతినిధి వడ్డేపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, మండల అధ్యక్షులు బాయి లింగరెడ్డి, గోపిటి శ్రీనివాస్, కొమ్ముల రాజుపాల్, దునికెల నవీన్, పార్లమెంటరీ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, బిజెపి, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



# మరో బంగ్లాదేశ్ చేస్తారా..?

◦ ప్రతిపక్షాలపై మమతా బెనర్జీ ధ్వజం



**కోల్ కతా:** ప్రతిపక్షాలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఒంటికాలిపై లేశారు. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ మృతి అంశాన్ని రాజకీయం చేయడంపై ధ్వజమెత్తారు. సీపీఎం, బీజేపీ నేతలు చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బెంగాల్‌ను మరో బంగ్లాదేశ్‌లా మారుస్తారా ఏంటీ అని విరుచుకుపడ్డారు. నేను మీకో విషయం చెప్పదలుచుకున్నాను.. అధికారం కోసం నాకు అత్యాశ ఎంతమాత్రం లేదని తేల్చి చెప్పారు.

'వైద్యురాలి మృతికి సంబంధించి తమ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదు. ఆ రోజు రాత్రి కేసు ఎప్పటికప్పుడు పర్యవేక్షించా. కేసు గురించి నాకు పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి వివరించారు. మృతురాలి తల్లిదండ్రులతో నేను మాట్లాడాను. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని వారితో చెప్పా. నిందితుడిని ఉరి తీస్తామని స్పష్టం చేశా. హత్య కేసులో మా ప్రభుత్వం ఇంకా ఏం చేయలేదు. మేం ఎలాంటి చర్యలు తీసుకోలేదు అని' మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

**రాత్రంతా ఫోన్ మాట్లాడా**

'ఘటన జరిగిన రోజు రాత్రంతా కేసు గురించి అధికారులతో మాట్లాడా. మృతురాలి అంత్యక్రియలు జరిగే వరకు కేసు గురించి అధికారులు నాకు ఫోన్ చేశారు. మృతురాలి కుటుంబానికి పోలీసులు భద్రత కల్పించారు. 12 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేశారని వెల్లడించారు. త్వరగా నిందితుడిని పట్టుకోవడంతో కోల్‌కతా పోలీసులను అభినందించా. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించడం, డీఎన్ఏ సేకరించడం లాంటి కఠినమైన సవాళ్లను పోలీసులు ఎదుర్కొన్నారు. త్వరగా నిందితుడిని పట్టుకున్నారు. కేసు విషయంలో కోల్‌కతా హైకోర్టు జోక్యం చేసుకుంది. కేసును సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో కేసును సీబీఐ అధికారులకు అప్పగిస్తున్నాం అని' మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

**ఫాస్ట్ ట్రాక్ కోర్టు**

వైద్యురాలి ఘటనకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని మమతా వివరించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేశారు. ఆదివారం లోపు ఛార్జీ షీట్ దాఖలు చేయకుంటే కేసును సీబీఐ అధికారులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఇంతలో హైకోర్టు జోక్యం చేసుకోవడంతో సీబీఐకి అప్పగిస్తున్నామని ప్రకటించారు.



## ఇవన్నీ మనలో జాతీయ భావాన్ని కల్పిస్తాయి

### - సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి :** ఆగస్టు 15 భారతదేశం 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోనుండగా, ఏపీ సీఎం చంద్రబాబు ప్రజలకు ముందుస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రస్తావించారు. "మహోజ్వల చరిత గల మన దేశ సమగ్రతను కాపాడడం మనందరి కర్తవ్యం. అందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును అనుసరించి వరుసగా మూడో ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని జరుపుకుంటున్నాం. 'ఇంటింటా జాతీయ జెండా' అనే ఈ కార్యక్రమం మరింత విస్తరించడం ఆనందకర విషయం.మరీ ముఖ్యంగా... మన తెలుగువాడైన పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం జాతీయ జెండా రూపంలో ప్రతి ఇంటిపై ఎగరడం మనకు మరింత ప్రత్యేకం, గర్వకారణం. రేపు ప్రతి ఇంటిపై, ప్రతి కార్యాలయంపై మన మువ్వన్నెల జాతీయ జెండాను రెపరెపలాడించండి. అంతేకాదు, జాతీయ జెండాను మీ సోషల్ మీడియా పేజీలలో ప్రొఫైల్ పిక్ గా పెట్టుకోండి. ఇవన్నీ మనలో జాతీయ భావాన్ని కల్పిస్తాయి, స్ఫూర్తిని నింపుతాయి. అందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

## వారణాసి శివగంగా, అయోధ్య బలరామ అవార్డులను గెలుచుకున్న వైష్ణవి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీలు వాగ్దేవి వాయిద్య సంగీత నృత్య కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో వారణాశి, అయోధ్య నందు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో భద్రాచలం త్రివేణి స్కూల్ కి చెందిన వైష్ణవి పాల్గొని వారణాసి శివగంగా, అయోధ్య బలరామ అవార్డులను గెలుచుకోవడం జరిగింది. అంతేగాక ఈ బాలిక అనేక రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో పాల్గొని అనేకమార్లు బహుమతులు గెలుసుకోవడం కూడా జరిగింది. చిన్ననాటి నుంచి నృత్యం పట్ల తనకున్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ఆమని ప్రోత్సహించడం జరిగిందని తెలియజేశారు. ఆమె గురువు ప్రముఖ భద్రాచలం నాట్య గురువులు శ్రీమతి వరలక్ష్మి దగ్గర తను కూచిపూడి అభ్యసిస్తున్నానని తెలియజేసినారు. ఈ సందర్భంగా బాలికను త్రివేణి స్కూల్ యాజమాన్యం, పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా బాలిక తనను ప్రోత్సహించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేసింది.

## విద్యార్థులకు విద్యతోపాటు సమగ్ర అభివృద్ధి




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** స్థానిక సెయింట్ పాల్స్ పాఠశాల నందు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యతోపాటు సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలలో విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక ఆలోచనలు, ప్రతిభను పెంపొందించుకునేలా సృజనాత్మక తరగతి గది నిర్వహణ ప్రదర్శన అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అమృత భాయ్, రిటైర్డ్ సీనియర్ స్కూల్ అసిస్టెంట్ ఆర్వీఎస్ బాలాజీ రాజు, బి అరుణ, వ్యాపారవేత్త శ్రీమతి నళినీ, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు విద్యార్థుల సృజనాత్మకతను వినూత్న ఆలోచనలను పరిశీలించి వారికి, ఉపాధ్యాయ బృందానికి కొన్ని సలహాలు, సూచనలు అందించి విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు.

## రక్తదానంతో ప్రాణ దాతలు కండి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో గురువారం ఆగస్టు15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తలసేమియ పిల్లల కోసం ఆత్మకూరు (ఎం) పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని స్థానిక సబ్ఇన్స్పక్టర్ ఎస్ కృష్ణయ్య తెలిపారు. ఈ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. స్వచ్ఛంద రక్తదాతలు ఆత్మకూరు(ఎం)పోలీసు స్టేషన్ ఆవరణలోకి వచ్చి రక్తదానం చేయాలని సబ్ఇన్స్పక్టర్ ఎస్ కృష్ణయ్య కోరారు.

## సీతారామచంద్ర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్త రామదాసు కాలం నుంచి ప్రతి శ్రావణ మాసంలో భద్రాద్రి ఆలయంలో ఈ పవిత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీరంగం నుంచి ప్రత్యేకంగా పవిత్రాలను తీసుకువచ్చి భద్రాద్రి ఆలయంలో వారం రోజులపాటు పవిత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ సిబ్బంది పవిత్ర గోదావరి నది వద్దకు మంగళ వాయిద్యాల నడుమ వెళ్లి తీర్థ బిందెను తీసుకువచ్చారు. అనంతరం హోమశాలలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ కార్యనిర్వహణ అధికారి అర్చకులకు దీక్ష వస్త్రాలు అందించనున్నారు. గురువారం ఉదయం నుంచి అగ్ని మధనం అగ్ని ప్రతిష్ట ప్రత్యేక హోమాలు జరగనున్నాయి. శుక్రవారం ఉదయం లక్ష్మణ సమేత సీతారాములకు 108 వెండి కలశాలతో విశేష అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి పవిత్ర ధారణ జరగనుంది. గురువారం నుంచి ఈ నెల 19 వరకు జరగనున్న పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 19 వరకు నిత్య కళ్యాణాలు స్వామివారి ఏకాంత సేవను నిలిపివేశారు.

## ఏపీలో సంచలనం

### 16 మంది ఐపీఎస్‌లకు మెమోలు జారీ



**విశ్వంభర, అమరావతి :** గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ మంత్రులు, అధికార నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన ఐపీఎస్ అధికారులు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడే పరిస్థితి ఏపీలో కలిగింది. ప్రస్తుతం వెయిటింగ్ లిస్టులో ఉన్న పలువురు ఐపీఎస్ అధికారులకు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు మెమోలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉండి హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో లేనివారికి మెమోలు ఇచ్చారు. పీఎస్ ఆర్ ఆంజనేయులు, సునీల్ కుమార్ సహా 16 మందికి మెమోలు జారీ చేశారు. సంజయ్, కాంతిరాణా టాటా, కొల్లి రఘురామి రెడ్డి, అమ్మిరెడ్డి, విజయ్ రావు, విశాల్ గున్ని, రవిశంకర్ రెడ్డి, రిషన్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణకాంత్ పటేల్, పాలరాజులకు మెమోలు అందజేశారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు డీజీపీ కార్యాలయంలోనే ఉండాలని ఆదేశించారు. విధులు పూర్తయిన తర్వాత హాజరు రిజిష్టర్ పై సంతకం చేసి వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పైన పేర్కొన్న అధికారులు వైసీపీ ప్రభుత్వంలో అఖిల భారత సర్వీసులకు విరుద్ధంగా వ్యవహరించి ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## చంద్రబాబులో భయం మొదలైంది

### అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం

### ఏపీ మాజీ సీఎం జగన్



**విశ్వంభర, అమరావతి :** వైసీసీ అధ్యక్షుడు , ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుపై మరోసారి విరుచుకుపడ్డారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే పోటీ నుంచి తప్పుకున్నారని విమర్శించారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం భీమిలి, యలమంచిలి నియోజకవర్గాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు , కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆర్థిక సంక్షోభం, ఇతర కారణాలు చెబుతూ ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు క్యాలెండర్ ప్రకారం పథకాలు అందించామని పేర్కొన్నారు. పథకాలను ప్రతి ఇంటికి చేరవేశామని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన ప్రజావ్యతిరేకత కనిపిస్తోందని వెల్లడించారు. పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు ఐక్యంగా ఉండడంతోనే ఎమ్మెల్సీ ఎన్నిక నుంచి తప్పుకున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయని మండి పడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ఉండాలని, ప్రజలకు తోడుగా ఉంటే రాబోయే రోజుల్లో ఆదరిస్తారని అన్నారు.

## రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లా శాఖ రాష్ట్ర ఎం.సీ సభ్యులు, ట్రెజరర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి, రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కమిటీ సభ్యులు డా. బీ. విజయ భాస్కర్ గౌడ్ రాజ్ భవన్ లో రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన విష్ణుదేవ్ వర్మని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ భవిష్యత్తులో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలలో ముఖ్యమైన బ్లడ్ సెంటర్ నిర్మాణానికి చేయూతను అందించి నిధులను మంజూరు చేయాలని కోరారు.





## రంగారెడ్డి జిల్లాలో దారుణం గిరిజన బాలికపై అత్యాచారం

**విశ్వంభర, రంగారెడ్డి :** జిల్లాలో దారుణం జరిగింది. ఓ మైనర్ గిరిజన బాలికపై భూయజమాని అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన జిల్లాలోని శంషాబాద్ మండలం ఎర్రకుంట తండాలో చోటు చేసుకుంది. తండ్రితో కలిసి పనికి వెళ్లిన గిరిజన బాలికపై భూయజమాని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడికి భయపడి ఆమె నోరు విప్పలేదు. దీన్ని అవకాశంగా తీసుకుని పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడగా ఆమె గర్భం దాల్చింది. దీంతో బాలికను కొత్తూరు గ్రామానికి తీసుకెళ్లి అబార్షన్ చేయించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలో తండా, గ్రామ పెద్దలను కూర్చోబెట్టి రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. ఎలాగో తప్పు జరిగిందని, ఎంతో కొంత డబ్బు ఇచ్చి రాజీ చేసుకుంటానని చెప్పుకొచ్చాడు. దీంతో బాలిక, కుటుంబ సభ్యులు డబ్బులకు లొంగక శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడితో పాటు డాక్టర్ మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్యుడు పరారీలో ఉన్నట్టు సమాచారం. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



**విశ్వంభర, మేడిపల్లి:** అనుమతి లేని నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదుతో నిర్మాణ స్థలం వద్ద వెళ్ళి అనుమతి పత్రాలను అడిగినందుకు కార్పొరేషన్ సిబ్బందిపై పరుష పదజాలంతో బూతులు తిట్టిన సంఘటన బోడుప్పల్ కార్పొరేషన్ పరిదిలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి 1 వ డివిజన్ ఫ్రీ విలేజ్ రోడ్డు నెంబరు 5లో నూతనంగా చేపట్టిన నిర్మాణంపై ఫిర్యాదులు రావడంతో బోడుప్పల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది శ్రీకాంత్ సదరు నిర్మాణం వద్దకు వెళ్ళి అనుమతి కాపీ ఇవ్వాలని కోరగా సదరు నిర్మాణ దారుడు పత్రికలో రాయ లేని భాషను ఉపయోగించాడు. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది జరిగిన విషయాన్ని కమీషనర్ దృష్టికి తీసుకెళ్ళాడు. వెంటనే నిర్మాణాన్ని కూల్చివేయాలని సిబ్బందిని పురమాయించాడు. దీంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై ఇంటి నిర్మాణ దారుడు పరుష పాదజాలంతో దూషించిన అంశంపై కమీషనర్ రామలింగంను వివరణ కోరగా జరిగిన విషయాన్ని తెలిపారు. నిర్మాణ దారునిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పోరేషన్ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణంపై చర్యలు తప్పకుండా ఉంటాయని, ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ కరాకండిగా తెలిపారు.

## అయోధ్య బాలరాముడి శిల్పికి షాక్

### వీసా నిరాకరించిన అమెరికా

**బెంగళూరు:** అయోధ్యలోని రామ మందిరంలో ప్రతిష్టించిన బాలరాముడి విగ్రహాన్ని చెక్కిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు చేదు అనుభవం ఎదురైంది. కుటుంబంతో కలిసి అమెరికా సందర్శన కోసం చేసిన వీసా దరఖాస్తును ఆ దేశం నిరాకరించింది. వర్జీనియాలోని రిచ్‌మండ్‌లో ఆగస్ట్ 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రపంచ కన్నడ కాన్ఫరెన్స్ 2024 ఈవెంట్ జరుగనున్నది. అసోసియేషన్ ఆఫ్ కన్నడ కూటాస్ ఆఫ్ అమెరికా దీనిని నిర్వహిస్తున్నది. కర్ణాటకకు చెందిన ప్రసిద్ధ శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను ఈ సదస్సుకు ఆహ్వానించారు. అయితే ఆయన వీసా దరఖాస్తును అమెరికా తిరస్కరించింది.



# డబుల్ ఇస్మార్ట్ కోసం రామ్ ఫీట్లు



థియేటర్లలో మాస్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేయాలంటే హీరో ఏదో ఒక రిస్కీ ఫీట్ చేయాల్సిందే. మూవీ లవర్స్ కోసం అలాంటి రిస్క్ చేసే యాక్టర్లలో ఒకడు రామ్ పోతినేని. పూరీజగన్నాథ్ దర్శకత్వంలో రామ్ నటించిన చిత్రం డబుల్ ఇస్మార్ట్ . బ్లాక్ బస్టర్ హిట్ ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా పూరీ టీం ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానులు, సినీ జనాల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. కాగా ఈ సినిమా కోసం బాలీ (ఇండోనేషియా)కి వెళ్లి తక్కువ టైంలో తప్పనిసరి పరిస్థితుల్లో 18 కిలోలు బరువు తగ్గానని చెప్పాడు రామ్. కాగా ఈ మూవీలో గన్స్, రౌడీలతో స్టైలిష్ యాక్షన్ పార్టు ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి. దీని కోసం రామ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. డబుల్ ఇస్మార్ట్ బీటీఎస్ స్టిల్స్ చూస్తే ఈ విషయం మీకే అర్థమవుతుంది. ఈ మూవీని నైజాంలో ప్రైమ్ షో ఫిలిమ్స్ విడుదల చేస్తుండగా.. తమిళనాడులో పాపులర్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీ శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేస్తోంది. ఇప్పటికే ధిమాక్కిరికిరి డబుల్ ఇస్మార్ట్ టీజర్, ట్రైలర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది.

# ప్రభాస్ సినిమాలో నేను లేను

## అభిమానులకు షాకిచ్చిన మృణాల్ ఠాకూర్



వరుస విజయాలతో జోష్ మీదున్నారు ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన 'సీతారామం' బ్యూటీ మృణాల్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. ప్రభాస్‌తో మృణాల్ ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'ఇది హను రాఘవపూడి చిత్రం ఫస్ట్‌లుక్' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై మృణాల్ స్పందించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని కామెంట్ చేశారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అనే చర్చ మరోసారి మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ పీరియాడికల్ డ్రామాగా ఈ చిత్రం రానుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 17న రానున్నట్లు తెలుస్తోంది.

# ఆదిపురుష్ ఫెయిల్ కావడంతో ఏడ్చేశాను

## నటి కృతి సనన్ తాజా వేదన




రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఈ సినిమా పరాజయంపై తాజాగా స్పందించింది నటి కృతి సనన్. ఆదిపురుష్ ఫ్లాప్ అయినప్పుడు నేను చాలా బాధపడ్డాను. మనం ప్రాణం పెట్టిన సినిమాలు పరాజయం అయితే తీవ్ర కుంగుబాటుకు లోనవుతాం. కొన్నిసార్లు ఏడ్చేస్తాం. అయితే ఈ తప్పు ఎక్కడ జరిగిందోనని ఆలోచిస్తాం. ఎదుటివారి విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీయడం అనేది మా లక్ష్యం కాదు. ప్రతి ప్రాజెక్ట్ వెనుక ఉద్దేశం పాజిటివ్‌గానే ఉంటుంది. అయితే అప్పుడప్పుడు అది కొందరికి నచ్చకపోవచ్చు. ఏది ఏమైనా ఈ అనుభవాల నుండి మనం చాలా నేర్చుకుంటాం. ఒక నటిగా నేను ఎప్పుడు పాజిటివ్‌గా ముందుకెళ్లాలి. తర్వాతి ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలి. ఒక సినిమా హిట్ అవ్వడం అనేది చాలా అంశాల మీదా ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు మన పనిని మనం 100 శాతం పూర్తి చేసుకుంటూ వెళ్లాలి అంటూ కృతి వెల్లడించింది.గతేడాది 'క్రూ', 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా' సినిమాలతో హిట్లు అందుకున్న ఈ భామ ప్రస్తుతం దోపట్టి అనే సినిమాలో నటిస్తుంది. బాలీవుడ్ నటి కాజోల్ దేవ్‌గణ్ నటిస్తున్న ఈ సినిమాకు శశాంక చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నాడు.

# స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి అల్లు అర్జున్

## ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బన్నీ వాసు భావోద్వేగం



స్నేహితుడికి అవసరం ఉందంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అల్లు అర్జున్ అండగా ఉంటారని నిర్మాత బన్నీ వాసు అన్నారు. 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అర్జున్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నాకు కష్టం వచ్చిందంటే ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ మందుంటారు. వాళ్లలో ఒకరు మా అమ్మ అయితే.. రెండో వ్యక్తి నా స్నేహితుడు అల్లు అర్జున్. 'ఆయ్' సినిమా ప్రచారం సరిగ్గా జరగడంలేదని.. బన్నీని పోస్ట్ పెట్టమని అడగాలని మా టీమ్ వాళ్లు కోరారు. కానీ, నేను ఆయన్ను అడగలేదు. నేను సమాచారం ఇవ్వకుండానే ఆయనే తన ఎక్స్‌లో ఈ చిత్రం గురించి పోస్ట్ చేశారు. నాకు అవసరం ఉన్న ప్రతిసారి ఆయన ముందుండి నడిపిస్తారు. ఒక స్నేహితుడికి కష్టమొస్తే.. తనకు ఎలా సపోర్ట్ చేయాలని తెలిసిన ఏకైక వ్యక్తి నా దృష్టిలో అల్లు అర్జునే. 20 ఏళ్ల క్రితం నేను గీతా ఆర్ట్స్ నుంచి వెళ్లిపోవాల్సిన సంఘటన ఎదురైంది. ఆరోజు బన్నీ నాకు సపోర్ట్ చేయడం కోసం వాళ్ల నాన్నను కూడా ఎదిరించారు. అప్పుడు ఆయన సపోర్ట్ చేయకపోతే ఈరోజు నేను ఈ స్థానంలో ఉండేవాడిని కాదు. తన స్నేహితుల్లో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా బన్నీ సపోర్ట్ చేస్తాడు. మంచి వ్యక్తి' అంటూ తమ స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'సినిమాలకు సంబంధించిన విషయాలను సినిమా వరకు మాత్రమే ఆలోచించగల హీరో ఎన్టీఆర్. 'ఆయ్' ట్రైలర్‌ను పిఠాపురంలో చేయాలని నాకు అనిపించినప్పుడు ఎన్టీఆర్‌కు ఈ సమాచారాన్ని అందించాం. నిర్మాతకు ఉపయోగ పడుతుందంటే మిగతా విషయాలేవీ పట్టించుకోవద్దు అని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి. నేను మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమానిని. ఈరోజు ఆయనతో పాటు పొలిటికల్ జర్నీలో ఉంటున్నానంటే నా అదృష్టమని చెప్పాలి' అంటూ బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ బావ మరిది నార్నే నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్' ... మేం ఫ్రెండ్సండి అనేది ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్. అంజి కె.మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఎన్టీఆర్‌కు గాయాలంటూ.. ప్రచారం

క్షేమంగానే ఉన్నారంటూ స్పష్టీకరణ ప్రముఖ హీరో ఎన్టీఆర్ కు తీవ్ర గాయాలయ్యాలంటూ బుధవారం ఉదయం వార్తలొచ్చాయి. దీనిపై నటుడి టీమ్ స్పందించి ఆ వార్తలను ఖండించింది. ఆయన సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. 'జిమ్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమ చేతికి రెండు రోజుల క్రితం స్వల్ప గాయమైంది. అయినప్పటికీ ఆయన 'దేవర' షూటింగ్‌లో మంగళవారం పాల్గొన్నారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఆయకు పెద్ద ప్రమాదం జరిగినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం. దయచేసి ఆ ప్రచారాన్ని నమ్మకండి' అని విజ్ఞప్తి చేసింది. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఈ సినిమా షూటింగ్‌లోనే ప్రమాదం చోటుచేసుకుందని, నటుడికి గాయాలయ్యాయని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారని, ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారంటూ ప్రచారం జరగ్గా టీమ్ రియాక్ట్ అయింది.

# సమయానికి వస్తున్నారా?

- బల్దియా ఉద్యోగులను ఆరా తీసిన మేయర్
- మరోసారి ఆకస్మిక తనిఖీలు

**విశ్వంభర, హైదరాబాద్ బ్యూరో:** జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మరోసారి ఆకస్మిక తనిఖీలతో బల్దియా ఉద్యోగులను హడలెత్తించారు. జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగులు క్రమశిక్షణను పాటిస్తూ రోజూ పదిన్నర గంటలకల్లా విధులకు హాజరు కావాలని ఆమె సూచించారు. బుధవారం ఆమె మరోసారి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్ లోని కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులను నవ్వుతూ పలకరిస్తూనే డ్యూటీకి ఎపుడు వచ్చారంటూ ప్రశ్నించారు. వారి సమాధానం విన్న తర్వాత అటెండెన్స్ ను రిజిస్టర్ లో చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల క్రమశిక్షణ రాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని గుర్తించి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి విభాగం నుండి ఉదయం 10:45 గంటలలోపు అటెండెన్స్ రిజిస్టర్లను తన టేబుల్ పై ఉంచాలని ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో గల కంట్రోల్ రూం, సీపీఆర్వో కార్యాలయం, సిటిజన్ సర్వీస్ సెంటర్, ట్రెజరీ విభాగాలను మేయర్ తనిఖీ చేశారు. పలు విభాగాల్లో ఉద్యోగులు పూర్తి స్థాయిలో సమయానికి విధుల్లో ఉండటంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మేయర్ తో పాటు తనిఖీల్లో సీపీఆర్వో ముర్తుజా అలీ, ఓఎస్డీ అనురాధ తదితరులున్నారు.

# హైడ్రాపై వ్యతిరేకత

**రద్దు చేయాలని మజ్లీస్ కార్పొరేటర్ల డిమాండ్**
**మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం**

**విశ్వంభర, హైదరాబాద్ బ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని సర్కారు ఆస్తుల పరిరక్షణ, పటిష్టంగా విపత్తుల నిర్వహణ నిమిత్తం సర్కారు ఎంతో హడావుడిగా ఏర్పాటు చేసిన హైడ్రా యాక్షన్ కు నిరసన సెగ మొదలైంది. హైడ్రా ను రద్దు చేయాలంటూ మజ్లీస్ పార్టీ వ్యతిరేక గళం విప్పింది. అసలు హైడ్రా ఏర్పాటే చట్టవిరుద్ధమని, దాన్ని వెంటనే రద్దు చేయాలని కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా ఏర్పాటుకు సంబంధించి జీహెచ్ఎంసీలోని స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ తీర్మానాల్లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. షేక్ పేట కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఫరాజుద్దీన్ నేతృత్వంలో ఏడుగురు మజ్లీస్ కార్పొరేటర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ వాసులకు మౌలిక వసతులు, అత్యవసర సేవలను అందించే జీహెచ్ఎంసీకి ప్రధాన బాస్ మేయరేనని, మేయర్ కు ఎలాంటి సమాచారం లేకుండా హైడ్రా హడావుడి చేయటాన్ని బృందం తప్పుబట్టింది. జీహెచ్ఎంసీ నిధులతో ఇప్పటికే ఈవీడీఎంకు నిధులిస్తున్నామని, జీహెచ్ఎంసీ చట్టంలోని హైడ్రాకు జీహెచ్ఎంసీ ఆదాయం నుంచి ఎలాంటి నిధులు కేటాయించరాదని సూచించినట్లు తెలిసింది.

**వ్యతిరేకత ఎందుకు?**

ఇటీవల రాజేంద్రనగర్ లోని చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మజ్లీస్ పార్టీ బహద్దూర్ పురా ఎమ్మెల్యే మొబిన్ కు చెందిన ఓ నిర్మాణం కూడా ఉండటం, దాన్ని హైడ్రా నేలమట్టం చేయటాన్ని అడ్డుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే, ఇద్దరు కార్పొరేటర్లను పోలీసులు అరెస్టు చేసినందుకే మజ్లీస్ వ్యతిరేకిస్తుందా? అన్న చర్చ లేకపోలేదు. ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిదారులు చెల్లించే పన్నుతో పౌర సేవల నిర్వహణ, అభివృద్ధి చేపట్టాల్సిన జీహెచ్ఎంసీ ఖజానా నుంచి ఎందుకు హైడ్రాకు నిధులివ్వాలంటూ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. పైగా హైడ్రా కార్యకలాపాలపై త్వరలోనే స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ లో చర్చించాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఈ విషయమై ఇతర కార్పొరేటర్లతో కూడా మాట్లాడి నిర్ణయం తీసుకోవల్సి ఉంటుందని మేయర్ వారికి సర్ది చెప్పినట్లు సమాచారం.

# మెట్రో స్టేషన్లలో పార్కింగ్‌కు ఇక డబ్బులు చెల్లించాల్సిందే

- ఎల్ అండ్ టీ , మెట్రో రైలు సంస్థ ప్రకటన
- ప్రయాణికుల ఆందోళన

**విశ్వంభర, హైదరాబాద్:** మెట్రో రైలులో ప్రయాణించే వారికి ఎల్ అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్ఎల్) షాకింగ్ న్యూస్ చెప్పింది. ఇకపై వాహనాలతో వచ్చి మెట్రో స్టేషన్‌లో పార్కింగ్ చేసి వెళ్లాలంటే కచ్చితంగా డబ్బులు చెల్లించాల్సిందేనని ఎల్అండ్‌టీ ప్రకటించింది. మొత్తం 3 కారిడార్లలో 50 స్టేషన్లు ఉండగా 40 స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ సదుపాయం ఉంది. అందులో చాలా స్టేషన్లలో ఇప్పటికే పెయిడ్ పార్కింగ్ అమలు చేస్తుండగా నాగోల్ నుంచి మియాపూర్ కారిడార్‌లో చివరి స్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని కల్పించారు. అనూహ్యంగా ఆ రెండు చివరి స్టేషన్లలో కూడా ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని ఎత్తివేస్తూ డబ్బులు వసూలు చేయడం పట్ల ప్రయాణికులు ఆందోళనకు దిగారు. టికెట్ ధరలు పెంచడంతో పాటు పార్కింగ్ ఫీజుతో వసూళ్లకు పాల్పడటం అన్యాయమంటూ ఎల్అండ్ టీ తీరుపై మండిపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ నాగోల్, మియాపూర్ స్టేషన్లలో కూడా పెయిడ్ పార్కింగ్ అమలు చేస్తామని స్పష్టం చేసింది. మెరుగైన సదుపాయాలు అందించేందుకే : ఆగస్టు 25 నుంచి నాగోల్ మెట్రోస్టేషన్, సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ అమలు చేస్తామని సంస్థ ప్రకటించింది. పైలట్ రన్‌గా బుధవారం నాగోల్ మెట్రో స్టేషన్‌లో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని పరిశీలించామని, ప్రయాణికుల ఆందోళనతో తాత్కాలికంగా నిలిపివేసి ఆగస్టు 25 నుంచి అమలు చేస్తామని వెల్లడించింది. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులకు కలిగిన అసౌకర్యం పట్ల చింతిస్తున్నట్లు పేర్కొన్న ఎల్అండ్‌టీ పార్కింగ్ ప్రదేశాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకే పెయిడ్ పార్కింగ్ తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులు సహకరించాలి : ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ కోసం స్పష్టమైన సూచనలు చేయడంతో పాటు 24 గంటలు సీసీ కెమెరాల నిఘా, సులభమైన పద్ధతిలో చెల్లింపు విధానాలు, బయో టాయిలెట్స్ సౌకర్యం కల్పించేందుకు పార్కింగ్ రుసుము తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం పార్కింగ్ ఫీజులను పర్మినెంట్‌గా ప్రదర్శిస్తున్నామని తెలిపింది. ప్రయాణికులు తమ మద్దతు, సహకారాన్ని ఎల్ అండ్ టీ మెట్రో రైలుకు అందించాలని విజ్ఞప్తి చేసింది.

**ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో ఫ్రీ పార్కింగ్ వివాదం:** హైదరాబాద్ ఉప్పల్ మెట్రోలో ఉచిత పార్కింగ్ ఎత్తివేయడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో కొంత సేపు ప్రయాణికులు, మెట్రో సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు ఫ్రీ పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మెట్రోరైలు టికెట్ల ధరలు పెంచి, ఇప్పుడు పార్కింగ్‌కు కూడా డబ్బులు వసూలు చేయడం అన్యాయమని వాపోయారు. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికంగా కలకలం రేగింది.



# వ్యాధుల వ్యాప్తి అరికట్టాలి

- అందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్లు, ఉన్నతాధికారులు హాస్టళ్లను, పాఠశాలలను సందర్శించాలి
- సీఎస్ శాంతికుమారి సమీక్ష ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** సీజనల్ జ్వరాలు, డెంగ్యూ, చికన్‌గునియా తదితర వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కలెక్టర్లు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను, ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో సాధించిన ప్రగతిని సమీక్షించారు. కలెక్టర్లతో పాటు జిల్లాలోని ఇతర ఉన్నతాధికారులు అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, సందర్శించి పిల్లలకు జ్వరాలు ఇతర వ్యాధులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరం కేసులు వచ్చినప్పుడు సమర్థవంతంగా స్పందించాలని అన్నారు. హాస్టళ్లు, పాఠశాలలు, తదితర సంస్థలలో ఆహారం, పారిశుధ్యాన్ని కూడా తనిఖీ చేయాలని ఆమె తెలిపారు. కలెక్టర్లు అన్ని పిహెచ్‌సిలను సందర్శించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన నాణ్యమైన సేవలు అందించేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. తగిన మోతాదులో టెస్టింగ్ కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఫ్రైడే డ్రై డే ప్రచారాన్ని కచ్చితంగా కొనసాగించాలని అన్నారు. రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను యాక్టివేట్ చేయాలని, గ్రామాలు, పట్టణాలలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

**ప్రైవేట్ ఆసుపత్రులపై కన్నేయండి**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో మందులకు అనుచితమైన ధరలు, అనవసరంగా వైద్యం చేయించకుండా చూసేందుకు ప్రైవేట్ ఆసుపత్రులతో కూడా సమావేశం నిర్వహించాలని సీఎస్ కోరారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రజలను దోపిడీ చేయకుండా యాజమాన్యాలు న్యాయమైన పద్ధతులను అనుసరించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ నెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌లను సీఎస్ అభినందించారు. ఇది నిరంతర కార్యక్రమం కాబట్టి బ్యాలెన్స్ ప్లాంటేషన్‌ను కూడా పూర్తి చేయాలని ఆమె అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మెరుగుపరచడానికి దృష్టి సారించాలని అన్నారు. వీధికుక్కలకు స్టెరిలైజేషన్ కార్యక్రమం చేపట్టాలని అన్నారు.అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో టీడీపీ నేత దారుణ హత్య



**విశ్వంభర, కర్నూలు:** పత్తికొండ మండలం హోసూరులో దారుణం చోటు చేసుకుంది. టీడీపీ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు దారుణ హత్యకు గురయ్యాడు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఊరి బయట కళ్లలో కారం పొడి చల్లి వేట కొడవళ్లతో దుండగులు నరికి చంపేశారు. సార్వత్రిక ఎన్నికల్లో హోసూరు గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ తేవడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోయారు. ఏపీలో టీడీపీ కూటమి దాదాపు అన్ని చోట్ల భారీ మెజార్టీతో విజయం సాధించింది. ఈ విజయానికి చాలా మంది నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కృషి చేశారు. ఈ క్రమంలోనే హోసూరు గ్రామంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. ఈ విషయాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికలు జరిగి రెండు నెలలు అవుతున్నా కానీ వారిలోని ఆగ్రహావేశాలు చల్లారడం లేదు. హోసూరులోనూ టీడీపీకి భారీ మెజారిటీ వచ్చింది. దీంతో తమ గ్రామంలో భారీ మెజారిటీ రావడానికి శ్రీనివాసులే కారణమని భావించారు. సమయం చూసి బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఊరి బయట కళ్లో కారం కొట్టి వేట కొడవళ్లతో దారుణంగా నరికి చంపేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ హత్యోదంతంపై స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు స్పందించారు. ఘటనా స్థలానికి వెళ్లి శ్యాంబాబు కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీనివాసులు హత్యకు గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. 'కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరులో టీడీపీ మాజీ సర్పంచ్ వాకిటి శ్రీనివాసులును వైసిపి మూకలు దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఎన్నికల్లో టీడీపీ తరఫున కీలకంగా పనిచేశాడనే కక్షతో శ్రీనివాసులు కళ్ళల్లోకి కారం కొట్టి కిరాతకంగా హతమార్చారు. ప్రజాక్షేత్రంలో తిరస్కారానికి గురైనప్పటికీ జగన్ అండ్ కో తమ పాత పంథా మార్చుకోకుండా ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. తెలుగుదేశం శ్రేణుల సహనాన్ని చేతగానితనంగా భావిస్తూ, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై ప్రజా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. వైసీపీ మూకల చేతిలో బలైన శ్రీనివాసులు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుంది' అంటూ ట్వీట్ చేశారు.

# ఉన్న మాట అంటే మంత్రులకు ఉలుకెందుకు?

- సీతారామ ప్రాజెక్టు పై మాజీ మంత్రి హరీశ్ అన్నదాంట్లో తప్పేముంది?
- ఓ మంత్రి కంట తడి పెట్టారు ..ఎందుకో ఆశ్చర్యం కలిగింది.
- కేసీఆర్ హయాంలో లో సీతారామ ప్రాజెక్టు పనులు దాదాపు గా పూర్తయ్యాయి
- కమీషన్లు ఇవ్వడం.. తీసుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటు
- ఎవరి హయం లో తెలంగాణ ప్రాజెక్టులు పూరయ్యాయో చర్చకు వస్తారా? మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** కిరణ్ కుమార్ రెడ్డిదే బలహీనమైన ప్రభుత్వం అనుకుంటే అంతకన్నా బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్ లో ఈరోజు మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఉన్న మాట అంటే మంత్రులకు ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. ఓ మంత్రి కంటతడి పెట్టడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో సీతారామ ప్రాజెక్టు పనులు దాదాపుగా పూర్తిచేశారని, కనీసం బటన్ నొక్కేటపుడైనా కేసీఆర్ కష్టం గురించి చెప్పాలని మంత్రులను కోరారు. మంత్రి ఉత్తమ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, కనీసం అధికారులతో ఆయన మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి 2022 దాకా వరుసగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపితే అనుమతులు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టుపై కనీసం ఒక ఉత్తరమైనా రాశారా అని ప్రశ్నించారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత తప్పటడుగు వేసి బీఆర్ఎస్ ఒత్తిడితో వెనక్కి తగ్గారని కాంగ్రెస్ హయాంలోలాగా కేసీఆర్ ప్రభుత్వంలో ఏ ప్రాజెక్టు అంచనాలు పది, పదిహేను రెట్లు పెంచలేదని పేర్కొన్నారు. కమీషన్లు ఇవ్వడం, తీసుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటన్న మాజీ మంత్రి కాలువలు తవ్వకముందే మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు ఇంకా చంద్రబాబు, వైఎస్ భజన చేస్తున్నారని వాళ్లిద్దరూ తెలంగాణలో ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. వైఎస్ హయాంలో ఆంధ్రా, రాయలసీమ ప్రాజెక్టులు పూర్తయి తెలంగాణ ప్రాజెక్టులు పెండింగ్‌లో పడ్డాయని అన్నారు. వైఎస్ రాయలసీమకు 350 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేశార ని తెలంగాణకు ఏం చేశారని అడిగారు . వైఎస్, చంద్రబాబు హయాంలో తెలం గా ణలో మూడున్నర క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న చెరువు అయినా కట్టారా అని ప్రశ్నించిన జగదీష్ రెడ్డి ఎవరి హయాంలో తెలంగాణ ప్రాజెక్టులు పూర్తయ్యాయో ఉత్తమ్, భట్టి చర్చకు వస్తారా అని సవాల్ చేశారు. ఎస్సార్బీసీ పూర్తయినా పూర్తి కాలేదని కాంగ్రెస్ మంత్రులు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై మంత్రులు మాట్లాడిన ప్రతి వాక్యం అబద్ధమే అన్న ఆయన మంత్రులు మాట్లాడిన దానిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. వడ్లు పండితే ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోనని కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఉన్నా సాగునీరు ఇవ్వడం లేదని మాజీమంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిడ్డలను స్థానికేతరులను చేసే విధంగా జీఓ 33 తెచ్చారని, ఇంత కన్నా తెలంగాణకు ద్రోహం ఏముంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ 33ను వెంటనే రద్దు చేయాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- అమరుడైన ఆర్మీ అధికారి మృతి
- నలుగురు ఉగ్రవాదులు హతం..!

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారత సైన్యానికి చెందిన కెప్టెన్ దీపక్ సింగ్ మరణించారు. దోడా జిల్లాలోని శివగడ్- అస్సాడ్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల నక్కి ఉన్నారని భద్రతా దళాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో భారత సైన్యంతోపాటు జమ్మూ కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా అటవీ ప్రాంతంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో ఈ రోజ ఉదయం ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో కెప్టెన్ దీపక్ సింగ్ మృతి చెందారు.

# ఎర్రకోటపై వరుసగా 11వ సారి..

(మొదటి పేజీ తరువాయి)

జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత అంతటి ఘనత సాధించిన నేతగా చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మోదీ మరో రికార్డును నమోదు చేయబోతున్నారు. స్వాతంత్య్ర వేడుకలకు దేశం సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. ఆగస్టు 15న ఢిల్లీలో వరుసగా 11వ సారి మోదీ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం ఎర్రకోట నుంచి వరుసగా 11వ సారి జాతిని ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. తద్వారా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఆ ఘనత సాధించిన తొలి ప్రధానిగా మోదీ రికార్డు నెలకొల్పనున్నారు. మరోవైపు ఈ వేడుకలకు 18 వేల మందికిపైగా హాజరవుతారని అంచనా. పేదలు, మహిళలు, యువత, రైతులను ఈ వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్లు తెలిసింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందాన్ని కూడా ఈ వేడుకలకు ఆహ్వానించాలని భావిస్తున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నారు. ఈ వేడుకలకు సర్వం సిద్ధమైంది.

# జెండా పండుగకు ముస్తాబైన గోల్కొండ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి పర్యవేక్షిస్తున్నారు.

# ఏఎస్పీ పి.కృష్ణమూర్తికి రాష్ట్రపతి పతకం


**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ నార్కోటిక్స్ విభాగంలో పనిచేస్తున్న అడిషనల్ సూపరింటెండెంట్ పి.కృష్ణమూర్తి రాష్ట్రపతి పతకానికి ఎంపికయ్యారు. అత్యంత ప్రతిభావంతంగా పనిచేసిన అధికారులకు ఈ మెడల్ బహూకరిస్తారు. పోలీస్ కమిషనర్ అవినాశ్ మొహంతి, కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, సబ్ ఇన్‌స్పెక్టర్లు కొమరబత్తిని రాము, అబ్దుల్ రఫీఖ్, ఇక్రం అబ్ ఖాన్, శ్రీనివాస మిశ్ర, కుంచాల బాలకాశయ్య, ఎ.లక్ష్మయ్య, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గుంటి వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ నూతలపాటి జ్ఞాన సుందరి ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

# హైదరాబాద్‌లో రూ.కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

**నైజీరియన్ సహా ముగ్గురి అరెస్టు**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.10 కోట్ల విలువైన 256 గ్రాముల డ్రగ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నైజీరియన్, డ్రగ్ డెలివరీ బాయ్, మరో నిందితుడు ఉన్నారు. ఈ డ్రగ్స్ ముఠాను బంజారాహిల్స్ పోలీసులు, హెచ్ న్యూ పోలీసుల సంయుక్త కార్యాచరణతో పట్టుకున్నారు.

# రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు నిరాశే



**పారిస్:** భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు నిరాశ తప్పలేదు. తనకు సిల్వర్ మెడల్ ఇవ్వాలంటూ చేసిన అప్పీల్‌ను స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ తిరస్కరించింది. ప్యారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కిలోల విభాగంలో వినేశ్ ఫైనల్‌కు చేరింది. అయితే, ఫైనల్‌కు ముందు నిర్ణీత పరిమితి కంటే వంద గ్రాములు అధికంగా బరువు ఉన్నట్లు తేలడంతో అనర్హురాలిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తనకు సెల్వర్ మెడల్ ఇవ్వాలంటూ స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్‌కు అప్పీల్ చేసింది. ఈ అంశంపై విచారణ జరిపిన కాస్.. నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. అయితే, ఈ నెల 16 నిర్ణయం ప్రకటిస్తామన్న కాస్.. అనూహ్యంగా బుధవారమే నిర్ణయాన్ని వెలువరించింది. కాస్ నిర్ణయంతో ఒలింపిక్‌లో పతకం సాధించాలన్న వినేశ్ కల చెదిరిపోయినట్లయ్యింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ , ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి వ్యతిరేకంగా వినేశ్ ఫోగట్ చేసిన అప్పీల్‌ను ట్రిబ్యునల్ ఫర్ స్పోర్ట్స్ తిరస్కరించడంపై భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష నిరాశ వ్యక్తం చేశారు.

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై

# ప్రభుత్వానికి ఊరట

## హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే



**ఢిల్లీ:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి కాస్త ఊరట లభించింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యానారాయణలుసుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు, కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని వాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం, ప్రభుత్వ విధి అని గుర్తు చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి, కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేసిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పిటిషన్‌పై విచారణను నాలుగు వారాలు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం, గవర్నర్ ఎలాంటి చర్యలు తీసుకున్నా, సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని స్పష్టంచేసింది.



### కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా

# గోవింద్ మోహన్..

## కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం

**ఢిల్లీ:** కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్ నియామకాల కమిటీ బుధవారం నియమించింది. ఆయన సిక్కిం కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌శాఖలో కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పని చేస్తున్న అజయ్ కుమార్ భల్లా పదవీకాలం ఈ నెల 22న ముగియనున్నది. ఆ తర్వాత గోవింద్ మోహన్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు హోం వ్యవహారాల మంత్రిత్వశాఖలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గా సేవలందించనున్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలో స్పెషల్ డ్యూటీ అధికారిగా గోవింద్ మోహన్ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. భల్లా పదవీకాలం అనంతరం ఆయన హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తారు.


# సీతారామ ఎత్తిపోతలకు నేడే ముహూర్తం

- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- వైరా సభ వేదిక నుంచే మూడో విడత రుణమాఫీ

**వి శ్వంభర , హైదరాబాద్:** ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో నిర్మించిన సీతా రా మ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం కొత్తగూడెం జిల్లా పూసుగూడెం చేరుకోనున్న సీఎం సీతారామ ప్రాజెక్టు వద్ద పైలాన్ ఆవిష్కరించి, మోటర్ స్విచ్ ఆన్ చేయనున్నారు. అనంతరం మంత్రులతో కలిసి గోదావరి జలాలకి పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి నేరుగా వైరాలో జరగనున్న బహిరంగ సభకు హాజరవుతారు. ఆ బహిరంగసభ వేదికపై నుంచే మూడో విడత రైతురుణ మాఫీని రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

**ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల**

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొదటి మోటారు స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వరంగల్, నల్గొండ జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని తొమ్మిది నెలల వ్యవధిలోనే ఈ ప్రాజెక్టు ద్వారా నీరందించే విధంగా పనులు పూర్తి చేయటం చరిత్ర అని అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజునే సీతారామ ప్రాజెక్టు ప్రారంభించడం శుభ సూచకమని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైరాలో జరగనున్న బహిరంగ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం కలెక్టర్ ముజమిల్ ఖాన్ పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు 30 స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎంతో పాటు మంత్రులు హాజరవుతున్న దృష్ట్యా బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాలతో ఆ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.


















Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com